- aruhi group
www.mahaaprabha.com

# నమస్తే మహాప్రభ

ప్రజల కోసం.., ప్రజలతో...మహాప్రభ

తెలుగు దినపత్రిక

ఆదివారం
12-07-2026

సంపుటి : 01 సంచిక :110 పేజీలు : 08 వెల : ₹5/- తెలంగాణ , ఆంధ్రప్రదేశ్.

Published From RANGAREDDY TELANGANA.RNI NO : TGTEL/26/A0738 VOLUME 01 ISSUE110 NAMASTEY MAHAAPRABHA



Mr. NAKKA RAJU
Chairman of Mahaaprabha



## నన్ను చంపితే.. ఇరాన్‌ను ముక్కలు చేయండి

తనకేమైనా జరిగితే ఇరాన్‌ను నాశనం చేయాలని ఆదేశించానన్న ట్రంప్

**అధికారులకు ట్రంప్ సంచలన ఆదేశాలు..**

- ట్రంప్ వ్యాఖ్యలతో మరింత పెరిగిన అమెరికా-ఇరాన్ ఉద్రిక్తతలు
- ఒప్పందాన్ని ఉల్లంఘిస్తే ప్రతిచర్య తప్పదు
- నేరపూరిత అమెరికాతో మనం శాంతిని ఎలా కోరుకోగలం?
- అమెరికాకు ఇరాన్ తాజా హెచ్చరిక

న్యూఢిల్లీ,జూలై 11 (మహా ప్రభ)

తనపై హత్యా యత్నం తలపెట్టిన ఇరాన్‌ను ముక్కలు, ముక్కలు చేయాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు వెల్లడించారు. ట్రంప్ హత్యకు ఇరాన్ కుట్ర పన్నుతోందని, ఈ మేరకు ఇరాన్ వర్గాలు ప్లాన్లు రూపొందిస్తున్నాయని అంతర్జాతీయ మీడియా కథనాలను ఆయన తోసిపుచ్చారు. అయితే, అదే సమయంలో ఎలాంటి చర్యలు తీసుకోవాలో అధికారులకు తాను ఇప్పటికే రహస్యంగా ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. 'న్యూయార్క్ పోస్ట్' ప్రతినిధులతో మాట్లాడిన ట్రంప్..-మిగతా 3 లో

## పారుతున్న నీళ్లను ఎత్తిపోస్తే బ్యారేజీలు ఎందుకు?

కాళేశ్వరం అంశంపై బీఆర్ఎస్‌కు సీఎం రేవంత్ కౌంటర్



- 'మూడు బ్యారేజీల్లో నీరు నిల్వ చేయొద్దని ఎన్‌డీఎస్ఏ స్పష్టం చేసింది'
- ఈటల రాజేందర్ వ్యాఖ్యలు వాస్తవాలకు విరుద్ధమన్న సీఎం
- మెడిగడ్డలో లోపాలపై గతంలోనే హెచ్చరికలు వచ్చాయన్న రేవంత్
- ప్రణాళిక, డిజైన్, నిర్మాణంలో లోపాలున్నాయని ఎన్‌డీఎస్ఏ నివేదిక
- బ్యారేజీల పునరుద్ధరణకు కమిటీలు ఏర్పాటు చేసిన ప్రభుత్వం
- ప్రజల ముందుకు అన్ని వాస్తవాలు తీసుకొస్తామన్న సీఎం

హైదరాబాద్ జూలై 11 (మహా ప్రభ)

కాళేశ్వరంపై బీఆర్ఎస్ నేతలు అవాస్తవాలు చెబుతున్నారని సీఎం రేవంత్ అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ఈ 3 బ్యారేజీల్లో నీరు నింపకూడదని ఎన్డీఎస్ఏ స్పష్టంగా చెప్పిందన్నారు. హైదరాబాద్‌లో మీడియా సమావేశంలో మాట్లాడిన ఆయన.. బీఆర్ఎస్ చెబుతున్నట్లు కళ్లముందు నీళ్లు పారుతున్నంత మాత్రాన ఎత్తిపోసే అవకాశం ఉంటే బ్యారేజీలు కట్టే అవసరం ఏముందని ప్రశ్నించారు. బ్యారేజీలు కట్టడం అంటేనే పారుతున్న నీళ్లను నిలిపి వాటిని ఎత్తిపోయాల్సి ఉంటుందన్నారు. కన్నెపల్లి దగ్గర ఎత్తిపోతలకు అవకాశమే లేదని 93.5 -మిగతా 3 లో



## రైతాంగాన్ని నిలువునా ముంచుతున్న సీఎం

- కన్నెపల్లి నుంచి నీరు ఎత్తిపోయ వచ్చు
- రిటైర్డ్ ఇంజనీర్ల ఫోరం నివేదిక చూసి అయినా రేవంత్ రెడ్డి సోయి తెచ్చుకోవాలి
- సీఎం రేవంత్ రెడ్డిపై మండిపడ్డ కేటీఆర్
- హరీశ్ రావుపై ఆరోపణలను తిప్పి కొట్టిన కేటీఆర్

హైదరాబాద్ జూలై 11 (మహా ప్రభ)

కాళేశ్వరం ప్రాజెక్టు నీటి ఎత్తిపోతలు, రాష్ట్రంలో నెలకొన్న సాగునీటి సంక్షోభంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై సీఎం రేవంత్ రెడ్డిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తెలంగాణ భవన్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి తెలంగాణ రైతాంగాన్ని నిలువునా ముంచుతున్నారని మండిపడ్డారు. రిటైర్డ్ ఇంజనీర్ల ఫోరం నివేదిక చూసి అయినా సీఎం సోయి తెచ్చుకోవాలని డిమాండ్ చేశారు. మేడిగడ్డ బ్యారేజ్ గేట్లు మూసివేయకుండానే కేవలం కన్నెపల్లి పంప్ హౌస్ నుంచి నీటిని ఎత్తిపోయవచ్చని రిటైర్డ్ ఇంజనీర్ల ఫోరం ప్రభుత్వానికి లేఖ రాసిన విషయాన్ని కేటీఆర్ బహిర్గతం చేశారు. ప్రస్తుతం కన్నెపల్లి వద్ద 96.79 మీటర్ల మేర నీటి ప్రవాహం ఉందన్నారు. కానీ కేవలం 94 మీటర్ల లభ్యత ఉంటేనే పంపులను ఆన్ చేసి నీటిని లిఫ్ట్ చేయవచ్చని నిపుణులు స్పష్టం చేశారు.

-మిగతా 3 లో



## మరాఠీ రాకుంటే.. డ్రైవింగ్ లైసెన్స్ రద్దు!

- ఉత్తర్వులు జారీ చేసిన మహారాష్ట్ర ప్రభుత్వం
- స్థానిక భాషపై పట్టు కోసం కొత్త నిబంధనలు
- ఆటో, టాక్సీ డ్రైవర్లకు భాష నేర్చుకునేందుకు ఐదు వారాల గడువు
- ఇతర రాష్ట్రాల డ్రైవర్ల బాషతో లోకల్స్ ఇబ్బందులు

ముంబై, జూలై 11 (మహా ప్రభ)

మహారాష్ట్రలో ఆటో, టాక్సీ డ్రైవర్లకు మరాఠీ తప్పనిసరిగా రావాలని ఆ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సంచలనం రేపుతోంది. వచ్చేనెల 16వ తేదీలోగా మరాఠీ నేర్చుకోవాలని లేని పక్షంలో లైసెన్సు రద్దు చేస్తామని ప్రకటించింది. దీంతో ఇతర రాష్ట్రాలకు చెందిన డ్రైవర్లు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నపళంగా ప్రభుత్వం ఇలాంటి నిర్ణయం తీసుకుంటే తమ ఉపాధి పోతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మహారాష్ట్రలో మరాఠీ మాత్రమే మాట్లాడాలని కొన్నేళ్లుగా డిమాండ్ వినిపిస్తోంది.

-మిగతా 3 లో




## ఇంగ్లాండ్ గడ్డపై భారత్‌కు భంగపాటు..

- టీ20 సిరీస్‌లో వైట్‌వాష్..!
- ఇంగ్లాండ్‌తో ఐదో టీ20లోనూ భారత్ ఓటమి
- 56 రన్స్ తేడాతో ఇంగ్లాండ్ ఘన విజయం
- 4-0తో టీ20 సిరీస్ క్లీన్‌స్వీప్ చేసిన ఇంగ్లాండ్

న్యూఢిల్లీ, జూలై 11 (మహా ప్రభ)

ఇంగ్లాండ్‌తో టీ20 సిరీస్‌లో భారత్‌కు భంగపాటు తప్పలేదు. సౌతాంప్టన్ వేదికగా జరిగిన ఆఖరి ఐదో టీ20 మ్యాచ్‌లోనూ భారత జట్టుకు నిరాశే ఎదురైంది. ఇంగ్లాండ్ నిర్దేశించిన 258 పరుగుల లక్ష్యాన్ని ఛేదించలేక టీమిండియా మరో ఓటమిని తన ఖాతాలో వేసుకుంది. 20 ఓవర్లలో 201 పరుగులకు

-మిగతా 3 లో



## ముద్దుల..మురిపెం!

- 30 సెకన్లలో 195 ముద్దులు
- బ్రెజిల్ జంట అరుదైన ఘనత
- గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్‌లోకి ప్రేమ జంట
- దీని కోసం రెండేళ్లుగా ప్రాక్టీస్

న్యూ ఢిల్లీ,

ప్రేమను వ్యక్తపరచడానికి ఒక్కొక్కరూ ఒక్కో విధానాన్ని ఎంచుకుంటారు. కొందరు మాటలతో మనసు గెలుచుకుంటే మరికొందరు ఆలింగనాలతో ఆప్యాయతను పంచుకుంటారు. అయితే బ్రెజిల్‌కు చెందిన ఒక జంట మాత్రం తమ ప్రేమను ఏకంగా ప్రపంచ రికార్డు స్థాయికి తీసుకెళ్లింది. కేవలం 30 సెకన్ల వ్యవధిలో ఏకంగా 195 ముద్దులు పెట్టుకుని.. గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించి అందరినీ ఆశ్చర్యపరిచింది. ప్రస్తుతం ఈ రొమాంటిక్ ఫీట్‌కు సంబంధించిన వార్త సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతోంది.

3 లో




## 14న తెలంగాణ వ్యాప్తంగా కళాశాలల బంద్

- ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్షిప్ల విషయంలో ప్రభుత్వం అలసత్వం వహిస్తోందన్న ఏబీవీపీ
- వీటిపై ఆధారపడి 20 లక్షల మంది విద్యార్థులు చదువుకుంటున్నారని వెల్లడి
- ప్రభుత్వం, ప్రైవేట్ కాలేజీలు కలిసి విద్యార్థులను మోసం చేస్తున్నాయని మండిపాటు

హైదరాబాద్ జూలై 11 (మహా ప్రభ)

ఫీజు రీయింబర్స్మెంట్ పథకంపై తెలంగాణ ప్రభుత్వం అలసత్వం వహిస్తోందని ఏబీవీపీ విమర్శించింది. రాష్ట్రంలో ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్షిప్లలో జరుగుతున్న అలస్యాలను నిరసిస్తూ ఈ నెల 14న రాష్ట్రవ్యాప్తంగా కళాశాలల బంద్కు పిలుపునిస్తున్నట్లు ఏబీవీపీ ప్రకటించింది. వరంగల్ ప్రెస్క్లబ్లో మీడియా సమావేశం నిర్వహించిన ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి మాచెర్ల రాంబాబు ఈ ప్రకటన చేశారు. రాష్ట్రంలో సుమారు 20 లక్షల మంది విద్యార్థులు ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్షిప్లపై ఆధారపడి చదువుకుంటున్నారని రాంబాబు తెలిపారు. ప్రభుత్వం సకాలంలో ఫీజు విడుదల చేయకపోవడంతో -మిగతా 3 లో



## 'రాష్ట్ర హోదాపై మా సహనాన్ని పరీక్షించొద్దు'


- కేంద్రానికి ఒమర్ అబ్దుల్లా వార్నింగ్
- జూలై 20న జంతర్‌మంతర్ వద్ద ఎన్‌సీ ఆధ్వర్యంలో నిరసన
- 'మా సహనాన్ని బలహీనతగా భావించొద్దు'
- 'సరైన సమయం' అంటే ఏమిటో చెప్పాలని కేంద్రాన్ని డిమాండ్
- లడఖ్‌తో చర్చలు.. జమ్ముకశ్మీర్‌తో ఎందుకు కాదని ప్రశ్న
- అన్ని రాజకీయ పార్టీల మద్దతు కోరిన ఒమర్ అబ్దుల్లా
- జిల్లా కేంద్రాల్లోనూ ఆందోళనలకు పిలుపు
- కేంద్రం స్పందనపైనే తదుపరి కార్యాచరణ: సీఎం

3 లో

## షాబాద్‌లో రక్తపాతం

పోక్సో కేసు పెట్టారన్న కక్షతో ఆరుగురి హత్య

- బాధిత బాలిక, ఆమె తల్లి, నాయనమ్మ, నిందితుడి భార్య, ఇద్దరు చిన్నారులను చంపిన వైనం
- పోలీసుల నిర్లక్ష్యమే కారణమంటూ షాబాద్‌లో గ్రామస్తుల ఆందోళన
- బాధిత కుటుంబాలను పరామర్శించేందుకు వచ్చిన ప్రతిపక్ష నేతల అడ్డగింత
- నిందితున్ని కఠినంగా శిక్షిస్తాం : జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి
- నిందితుడి ఆచూకీ తెలిపితే రూ.2 లక్షల రివార్డు



షాబాద్ జూలై 11 (మహా ప్రభ)

రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలంలో శనివారం తెల్లవారుజామున రక్తపాతం జరిగింది. ఓ దుర్మార్గుడు సృష్టించిన నరమేధంతో రాష్ట్రం ఉలిక్కిపడింది. తనపై పోక్సో కేసు పెట్టారన్న కక్ష?తో దుండగుడు.. బాధిత బాలిక, ఆమె తల్లి, నాయనమ్మతోపాటు అతని భార్య, ఇద్దరు చిన్నారులు ఇలా మొత్తం ఆరుగురుని హత్య చేశాడు. ఈ ఘటన రెండు గ్రామాలను విషాదంలో ముంచేసింది. పోక్సో కేసులో నిందితున్ని అరెస్టు చేయకుండా, జైలుకు పంపకుండా పోలీసులు నిర్లక్ష్యం చేయడం.. -మిగతా 3 లో

## వియత్నాంలో టూరిస్ట్ బోటు బోల్తా..

- 15 మంది భారతీయులు మృతి, పలువురు గల్లంతు



**హనోయి జూలై 11( మహా ప్రభ)**
వియత్నాంలో టూరిస్ట్ బోటు బోల్తాపడింది. ఈ ప్రమాదంలో భారతీయులతో సహా 15 మందికిపైగా పర్యాటకులు మరణించారు. సముద్రంలో పలువురు గల్లంతయ్యారు. ఈ నేపథ్యంలో సహాయక చర్యలు చేపట్టారు. వియత్నాంలోని ఫూ క్వాక్ ద్వీపం సమీపంలో శనివారం ఈ సంఘటన జరిగింది. హాలాంగ్ బేలో 32 మంది పర్యాటకులు ఉన్న టూరిస్ట్ బోటు బోల్తా పడింది. ఈ సమాచారం తెలిసిన వెంటనే సహాయక చర్యలు చేపట్టారు. బోల్తా పడిన బోటు నుంచి పలువురిని కాపాడారు. భారతీయులతో సహా 15 మందికిపైగా టూరిస్టులు మరణించగా పలువురు గల్లంతైనట్లు తెలుస్తున్నది. మృతుల్లో తెలంగాణ, ఏపీకి చెందిన పర్యాటకులు ఉన్నట్లు సమాచారం.కాగా, వియత్నాంలో జరిగిన బోటు బోల్తా ప్రమాదంలో మరణించిన వారిలో పలువురు భారతీయులు ఉన్నట్లు ఆ దేశంలోని భారత రాయబార కార్యాలయం ధృవీకరించింది. స్థానిక అధికారుల సమన్వయంతో పరిస్థితిని నిశితంగా పర్యవేక్షిస్తున్నట్లు ఎక్స్ పోస్ట్‌లో పేర్కొంది. అయితే ఈ బోటు ప్రమాదానికి సంబంధించిన వీడియో క్లిప్స్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.

## 2030 నాటికి 35వేల కోట్ల వాణిజ్యం..

-భారత్, కివీస్ మధ్య డీల్



**క్రైస్ట్‌చర్చ్: జూలై 11( మహా ప్రభ)**
భారత్, న్యూజిలాండ్ మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం కుదిరింది. రాబోయే అయిదేళ్ల కోసం రెండు దేశాల కొత్త టార్గెట్‌ను నిర్దేశించుకున్నాయి. 2030 నాటికి సుమారు 35వేల కోట్ల ద్వైపాక్షిక వాణిజ్యాన్ని పెంచుకోవాలని ఇరు దేశాలు ఒప్పందం కుదుర్చుకున్నాయి. ప్రధాని మోదీ(రావీ వీశీఒఱ), కివీస్ ప్రధాని కిస్టోఫర్ లుక్సాన్ మధ్య దీనిపై ఒప్పందం జరిగింది. ప్రతి రంగంలోనూ నిర్దేశిత లక్ష్యాలతో ముందుకు వెళ్లాలని రెండు దేశాలు నిర్ణయించాయి. ఇండో పసిఫిక్ సంబంధాలపై కూడా ఇరు దేశ ప్రధానులు సంయుక్త ప్రకటన చేశారు. అంతర్జాతీయ చట్టాల ప్రకారం సముద్ర మార్గాలను వినియోగించుకోవాలని కూడా తమ ఒప్పందంలో రాసుకున్నారు. మూడు దేశాల పర్యటనలో ఉన్న ప్రధాని మోదీ శుక్రవారం ఆక్లాండ్ చేరుకున్నారు. ఇటీవల ఇరు దేశాల మధ్య స్వేచ్ఛా వాణిజ్య అగ్రిమెంట్ జరిగిన విషయం తెలిసిందే. ప్రధాని మోదీకి గ్రాండ్ వెల్కమ్ దక్కింది. స్థానిక తెగ మావోరిలు.. సంప్రదాయ రీతిలో స్వాగతం పలికారు.

## విద్యార్థిని శిక్షించడం ఆత్మహత్యకు ప్రేరేపణ కాదు..

బాంబే హైకోర్టు కీలక తీర్పు

**ముంబై జూలై 11( మహా ప్రభ)**



చదువు కోసం విద్యార్థిని ఉపాధ్యాయుడు శిక్షిస్తే, అది ఆ విద్యార్థిని ఆత్మహత్యకు ప్రేరేపించినట్టు కాదని బాంబే హైకోర్టు నాగ్‌పూర్ బెంచ్ వ్యాఖ్యానించింది. బుల్దానాకు చెందిన ఒక కేసులో జస్టిస్ మహేంద్ర చంద్వాని ఇటీవల తీర్పునిస్తూ, సదరు ఉపాధ్యాయునిపై నమోదైన క్రిమినల్ కేసును చట్టవిరుద్ధమని పేర్కొంటూ కొట్టివేశారు. నిరుడు బుల్దానా జిల్లాలోని వాసదికి చెందిన ఉపాధ్యాయుడు గోపాల్ సూర్యవంశీ తరగతి గదిలో వివేక్ అనే విద్యార్థిపై చదువు విషయమై కోప్పడి, 100 గుంజీలు తీయాలని శిక్షించారు. 25 గుంజీలు తీశాక వివేక్ మరి తీయలేనని చెప్పాడు. దీంతో ఉపాధ్యాయుడు మందలించారు. మనస్తాపానికి గురైన వివేక్ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అతని ఆత్మహత్య లేఖ ఆధారంగా పోలీసులు ఉపాధ్యాయుడిపై కేసు నమోదు చేశారు. ఘటన జరిగిన రోజు ఉపాధ్యాయుని మాటలు కఠినమైనవి అయినప్పటికీ, అతడి చదువు కోస మే ఆ మాటలు అన్నారని, దాని లో నేరపూరిత ఉద్దేశం లేదని కోర్టు పేరొంది. మృతి చెందిన బాలుడు సున్నిత మనసుడు కావడం వల్లే క్షణికావేశంలో ఆత్మహత్య చేసుకున్నాడని కోర్టు తెలిపింది.

## వికసిత్ భారత్ బిల్లుకు ఐఐటీలు, ఐఐఎంల అభ్యంతరం




**న్యూఢిల్లీ: జూలై 11( మహా ప్రభ)**
వికసిత్ భారత్ శిక్షా అధిష్టాన్ బిల్లు-2025లోని పలు నిబంధనల నుంచి తమను మినహాయించాలని ఐఐటీలు, ఐఐఎంలు, కేంద్ర విశ్వవిద్యాలయాలు కేంద్రాన్ని కోరాయి. తమ స్వయంప్రతిపత్తికి భంగం కలిగే అవకాశముందని, కేంద్రీకరణకు దారితీసే నిబంధనలపై అభ్యంతరం వ్యక్తం చేశాయి. ప్రస్తుతం ఈ బిల్లును బీజేపీ ఎంపీ డి. పురందేశ్వరి నేతృత్వంలోని సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) పరిశీలిస్తోంది. ఐఐటీ మద్రాస్, ఐఐటీ బాంబే సహా పలు సంస్థలు బిల్లులోని కొన్ని నిబంధనలను సవరించాలని సూచించాయి.

# కాంగ్రెస్ బడా నాయకుల చెర నుంచి తూప్రాన్ ప్రజల రూ.20 కోట్ల ప్రభుత్వ ఆస్తిని కాపాడుతాం

--అవసరమైతే హైకోర్టుకు వెళ్లి న్యాయపోరాటం చేస్తాం
--బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్ రెడ్డి
--ప్రజల ఆస్తిని కాజేయాలనే కుట్రలను తిప్పికొడతామని హెచ్చరిక



**తూప్రాన్, జూలై 11 (మహా ప్రభ)**
తూప్రాన్ మున్సిపాలిటీకి చెందిన దాదాపు రూ.20 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిపై కాంగ్రెస్ పార్టీకి చెందిన బడా నాయకుల కన్ను పడిందని, ప్రజల ఆస్తిని కాజేయాలనే ఎలాంటి ప్రయత్నాన్నైనా బీఆర్ఎస్ పార్టీ తీవ్రంగా ప్రతిఘటిస్తుందని గజ్వేల్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్ రెడ్డి హెచ్చరించారు. ప్రజల ఆస్తిని కాపాడేందుకు అవసరమైతే హైకోర్టును ఆశ్రయించి న్యాయపోరాటం చేస్తామని, ప్రాణాలను సైతం పణంగా పెట్టి ప్రజల హక్కులను పరిరక్షిస్తామని స్పష్టం చేశారు.
తూప్రాన్ పట్టణంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, 1972లో తూప్రాన్ గ్రామపంచాయతీగా ఉన్న సమయంలో ఓ ముస్లిం కుటుంబానికి చెందిన సుమారు 1,384 గజాల భూమిని అప్పటి గ్రామపంచాయతీ పాలకవర్గం చట్టబద్ధంగా కొనుగోలు చేసిందన్నారు. అప్పటి నుంచి గ్రామపంచాయతీ రికార్డుల్లో, అనంతరం మున్సిపాలిటీ ఏర్పడిన తర్వాత మున్సిపల్ రికార్డుల్లో, అలాగే రెవెన్యూ రికార్డుల్లో సైతం అది ప్రభుత్వ భూమిగానే నమోదు అయి ఉందని వివరించారు. ఈ భూమికి సంబంధించిన వివాదం సిద్ధిపేట కోర్టుకు వెళ్లిన సందర్భంలో కూడా అది తూప్రాన్ మున్సిపాలిటీకి చెందిన ప్రభుత్వ భూమేనని కోర్టు స్పష్టమైన తీర్పు ఇచ్చిందని వంటేరు ప్రతాప్ రెడ్డి పేర్కొన్నారు. అయినప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొందరు ప్రభావశీల కాంగ్రెస్ నాయకులు అధికార యంత్రాంగంపై ఒత్తిడి తెచ్చి ఆ భూమిని తమ ఆధీనంలోకి తీసుకునేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. గత రెండు సంవత్సరాలుగా కొందరు అధికారులు కాంగ్రెస్ నేతలకు అనుకూలంగా వ్యవహరిస్తూ కోర్టులకు తప్పుడు సమాచారం అందించి ప్రజల ఆస్తిని కబ్జా చేసే ప్రయత్నాలు చేశారని ఆయన విమర్శించారు. ప్రజల ఆస్తులను కాపాడాల్సిన బాధ్యత కలిగిన అధికారులు రాజకీయ ఒత్తిళ్లకు లోనై వ్యవహరించడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని అన్నారు. ఈ వ్యవహారంలో హైకోర్టును ఆశ్రయించి తూప్రాన్ ప్రజల రూ.20 కోట్ల విలువైన ఆస్తిని కాపాడేందుకు అన్ని విధాలా న్యాయపోరాటం చేస్తామని ఆయన స్పష్టం చేశారు. ప్రజలను చైతన్యవంతం చేసి, అన్ని వర్గాలను ఏకం చేసి ప్రభుత్వ భూమిని పరిరక్షించే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల అభివృద్ధి, సంక్షేమంపై దృష్టి పెట్టకుండా కబ్జాలు, బెదిరింపులు, గుండాయిజం, అక్రమ వసూళ్లు, ప్రభుత్వ భూముల ఆక్రమణలకే ప్రాధాన్యం ఇస్తోందని వంటేరు ప్రతాప్ రెడ్డి తీవ్రస్థాయిలో ఆరోపించారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను పూర్తిగా విస్మరించి అధికార దుర్వినియోగానికి పాల్పడుతోందని విమర్శించారు. గత మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తూప్రాన్ ప్రజలు తగిన గుణపాఠం చెప్పినా ఆ పార్టీ నాయకుల వైఖరిలో ఎలాంటి మార్పు రాలేదన్నారు. ప్రభుత్వ భూములపై కన్నేసి రికార్డులను తారుమారు చేస్తూ ప్రజల ఆస్తులను కాజేయాలనే ప్రయత్నాలు చేయడం అత్యంత దుర్మార్గమని మండిపడ్డారు. ప్రభుత్వ ఆస్తులను రక్షించాల్సిన నాయకులే వాటిని స్వాధీనం చేసుకోవాలని ప్రయత్నించడం ప్రజా విశ్వాసాన్ని దెబ్బతీసే చర్య అని పేర్కొన్నారు. తూప్రాన్ ప్రజల ఆస్తులపై కన్నేసిన ఎంతటి బడా కాంగ్రెస్ నాయకుడైనా ప్రజాక్షేత్రంలో నిలదీస్తామని, ప్రజలే వారికి తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. మంత్రి అజారుద్దీన్ పేరును అడ్డం పెట్టుకుని ఆర్డీవో, ఎమ్మార్వో, మున్సిపల్ కమిషనర్ తదితర అధికారులపై ఒత్తిడి తెచ్చి అక్రమాలకు పాల్పడుతున్నారని ఆయన ఆరోపించారు. ప్రజాస్వామ్య వ్యవస్థను దుర్వినియోగం చేస్తూ ప్రభుత్వ భూములను కబ్జా చేసే కుట్రలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమన్నారు. తూప్రాన్ గ్రామపంచాయతీ కాలం నుంచి ప్రజల ఆస్తిగా కొనసాగుతున్న ఈ భూమిని చివరి వరకు కాపాడి ప్రజలకే అంకితం చేస్తామని, ఇందుకోసం ఎలాంటి త్యాగానికైనా సిద్ధంగా ఉంటామని వంటేరు ప్రతాప్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు బండ నాగరాజు, కిష్టాపూర్ మహమ్మద్ హమ్మద్, ప్రముఖ వ్యాపారవేత్త డెకరేషన్ నాగరాజు, మాజీ మున్సిపల్ చైర్మన్ బొంది రవీందర్ గౌడ్, మాజీ వైస్ చైర్మన్ కొక్కొండ కాశిరెడ్డి, కౌన్సిలర్ జైపాల్ రాథోడ్ నాయక్, ఐలేష్ యాదవ్, బొడ్డు రాధాకుమారి శ్రీనివాస్, మల్కాపూర్ సర్పంచ్ పంజాల ఆంజనేయులు గౌడ్, పశుల నారాయణ, బుక్క విజయ్ గుప్త, పోతరాజు ధనరాజు, కుమ్మరి రమేష్, పల్లె ప్రభాకర్ రెడ్డి, మన్నె నాగరాజు, షబ్బీర్, గంగాధర్, వెంకటేష్, కోరభోయిన ప్రవీణ్ కుమార్, హరీష్ గౌడ్, తాటి విశ్వం, గుర్రం అంజి, గడ్డం శేఖర్‌తో పాటు తూప్రాన్ మున్సిపల్ పాలకవర్గ నాయకులు, పార్టీ కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# తూప్రాన్ కాంగ్రెస్‌కు కొత్త సారథులు






-మండల అధ్యక్షుడిగా జింక మల్లేష్ -- టౌన్ అధ్యక్షుడిగా జిన్నా భగవాన్ రెడ్డి ఏకగ్రీవ ఎన్నిక
-పార్టీ బలోపేతానికి సమష్టిగా కృషి చేయాలి: మాజీ ఎమ్మెల్యే తూముకుంట నర్సారెడ్డి

**తూప్రాన్, జూలై 11(మహాప్రభ)**
తూప్రాన్ కాంగ్రెస్ పార్టీకి కొత్త నాయకత్వాన్ని ప్రకటిస్తూ తూప్రాన్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా జింక మల్లేష్, తూప్రాన్ టౌన్ (మున్సిపల్) కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా జిన్నా భగవాన్ రెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు గజ్వేల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే తూముకుంట నర్సారెడ్డి ప్రకటించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నూతన అధ్యక్షులను శాలువాలు కప్పి ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా తూముకుంట నర్సారెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీకి సుదీర్ఘ రాజకీయ చరిత్ర కలిగిన జిన్నా రాజిరెడ్డి కుటుంబానికి చెందిన, తూప్రాన్ మున్సిపాలిటీ 7వ వార్డు మాజీ కౌన్సిలర్ జిన్నా భగవాన్ రెడ్డిని టౌన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా నియమించడం సంతోషకరమని అన్నారు. అలాగే పార్టీ కోసం నిరంతరం పనిచేస్తున్న జింక మల్లేష్ను తూప్రాన్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా ప్రకటిస్తున్నట్లు తెలిపారు. మండలం, పట్టణంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసి గ్రామస్థాయి నుంచి బూత్ స్థాయి వరకు పార్టీని విస్తరించేందుకు ఇద్దరు నాయకులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పార్టీ బలోపేతం కోసం వారు చేపట్టే ప్రతి కార్యక్రమానికి తన సంపూర్ణ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. మాజీ ఫుడ్స్ కార్పొరేషన్ చైర్మన్ గంగుమల్ల ఎలక్షన్ రెడ్డి మాట్లాడుతూ, రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయమే లక్ష్యంగా పనిచేసే నాయకత్వాన్ని ఎంపిక చేశామని తెలిపారు. ప్రజలతో మమేకమై పార్టీ సిద్ధాంతాలను గ్రామాల వరకు తీసుకెళ్లే సామర్థ్యం ఉన్న నాయకులకు పార్టీ బాధ్యతలు అప్పగించిందన్నారు. నూతన అధ్యక్షులిద్దరూ సమర్థవంతంగా పనిచేసి కాంగ్రెస్ పార్టీని విజయపథంలో నడిపిస్తారనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. మన్నె భాను శుభాకాంక్షలు ఈ సందర్భంగా అంబేద్కర్ యువజన సంఘం తూప్రాన్ ప్రధాన కార్యదర్శి, యూత్ కాంగ్రెస్ నాయకుడు మన్నె భాను నూతన అధ్యక్షులు జింక మల్లేష్, జిన్నా భగవాన్ రెడ్డిలకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. వారి నాయకత్వంలో తూప్రాన్ ప్రాంతంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం కావాలని, ప్రజలకు అంకితభావంతో సేవలందిస్తూ పార్టీని విజయపథంలో నడిపించాలని ఆకాంక్షించారు. వారి పదవీకాలం విజయవంతంగా కొనసాగాలని కోరుతూ మరోసారి శుభాకాంక్షలు తెలియజేశారు.
ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ యాంజాల విఠల్ రెడ్డి, వైస్ చైర్మన్ మామిండ్ల కృష్ణ, నాచారం దేవస్థానం ట్రస్ట్ బోర్డు చైర్మన్ లయన్ పల్లెర్ల రవీందర్ గుప్త, రామునిగారి నాగరాజు గౌడ్, మామిడి వెంకటేష్, యావాపూర్ సర్పంచ్ యాంజాల స్వామి, ఘనపూర్ సర్పంచ్ సబ్బని వెంకటేష్, ఇమాంపూర్ నవీన్ గౌడ్, టి.ఎన్. శ్రీనివాస్, కోడిప్యాక నారాయణ గుప్త, నందాల శ్రీనివాస్, ఇస్లాంపూర్ సర్పంచ్ సంతోష్ రెడ్డి, భాయికాడి నర్సింలు, షారుక్, అస్సున్ను భాయ్, ప్రవీణ్, లడ్డు, మన్నె భాను, బోల్లు నాగులు, బాయికాడి వెంకటేష్తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# 7 ఏళ్ల బాలికపై హత్యాచారం..

## నిర్మాణంలో ఉన్న మాల్ బేస్‌మెంట్‌లో మృతదేహం



**లక్నో జూలై 11( మహా ప్రభ)**
ఏడేళ్ల బాలికపై అత్యాచారానికి పాల్పడి హత్య చేశారు. నిర్మాణంలో ఉన్న మాల్ బేస్‌మెంట్‌లో బాలిక మృతదేహాన్ని ఆమె కుటుంబ సభ్యులు గుర్తించారు. ఆ చిన్నారిపై అత్యాచారం జరిగినట్లు పోస్ట్‌మార్టంలో నిర్ధారణ అయ్యింది. కొందరు అనుమానితులను పోలీసులు అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు. ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్‌లో ఈ సంఘటన జరిగింది. నందగ్రామ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రాజ్ నగర్ ఎక్స్‌టెన్షన్ ప్రాంతంలో ఒక పెద్ద షాపింగ్ మాల్ నిర్మిస్తున్నారు. కూలీ పనులు చేస్తున్న ఒక కుటుంబం అక్కడ ఏర్పాటు చేసుకున్న తాత్కాలిక గుడిసెలో నివసిస్తున్నారు.కాగా, శుక్రవారం రాత్రి వేళ ఆ కుటుంబానికి చెందిన ఏడేళ్ల బాలిక అదృశ్యమైంది. ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు ఆ చిన్నారి కోసం అక్కడ వెతికారు. శనివారం తెల్లవారుజామున 1 గంట సమయంలో నిర్మాణంలో ఉన్న మాల్ బేస్‌మెంట్ ఏరియాలో బాలిక మృతదేహం కనిపించింది. ఆగ్రహం చెందిన బాలిక కుటుంబ సభ్యులు, స్థానికులు అక్కడి సెక్యూరిటీ గార్డ్‌పై దాడి చేశారు. మరోవైపు ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకున్నారు. బాలిక మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కోసం తరలించారు. హత్యకు ముందు ఆ బాలికపై అత్యాచారం జరిగిందని, తలకు తగిలిన గాయం కారణంగా ఆమె మరణించినట్లు పోస్ట్‌మార్టం నివేదికలో నిర్ధారణ అయింది. అయితే అత్యాచారం తర్వాత ఆ బాలికను మూడో అంతస్తు నుంచి కిందకు పడేయడంతో తలకు గాయంతో మరణించినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఆమె తల్లిదండ్రుల ఫిర్యాదుతో అత్యాచారం, హత్య, కిడ్నాప్‌తో పాటు పోక్సో చట్టంలోని సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఐదుగురు అనుమానితులను అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు. మరో ఇద్దరు అనుమానితులు పరారీలో ఉన్నట్లు పోలీస్ అధికారి తెలిపారు. నిందితులను గుర్తించేందుకు ఆ ప్రాంతంలోని సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలిస్తున్నట్లు వెల్లడించారు.

# నన్ను చంపితే.. ఇరాన్‌ను ముక్కలు చేయండి

(మొదటి తరువాయి)

"అలాంటిదేమీ లేదు, ఇజ్రాయెల్ మాకు ఎలాంటి సమాచారాన్ని అందించలేదు" అని స్పష్టం చేశారు. అయితే, ఇరాన్ హిట్ లిస్ట్ లో తాను చాలా కాలంగా 'నెంబర్ వన్' స్థానంలో ఉన్నాననే విషయాన్ని ఆయన అంగీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "ఒకవేళ నాకు ఏదైనా జరిగితే.. ఇరాన్ దేశ చరిత్రలో ఎప్పుడూ చూడని విధంగా, ఊహించని స్థాయిలో వారిపై బాంబుల వర్షం కురిపించి సర్వనాశనం చేయాలని నేను స్పష్టమైన ఆదేశాలు జారీ చేశాను" అని తెలిపారు. అంతకుముందు టర్కీ రాధాని అంకారలో జరిగిన నాటో సదస్సులో ఇరాన్ తో కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం ముగిసిపోయిందని ట్రంప్ యంత్రాంగం ప్రకటించింది. అయి నప్పటికీ, విజ్ఞప్తిపై చర్చలను కేస్-సాగిస్తామని ట్రంప్ తాజాగా పేర్కొనడం గమనార్హం. తాజా పరిణామాల నేపథ్యంలో అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు మరింత తీవ్రస్థాయికి చేరుకున్నాయి.ఒప్పందంలోని నిబంధనలను అమెరికా ఉల్లంఘిస్తే, తాము కూడా తగిన ప్రతిచర్య తీసుకుంటామని తాజాగా హెచ్చరించింది. ఈ మేరకు ఇరాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి ఒక ప్రకటన విడుదల చేశారు. కేవలం



అక్కడి ప్రభుత్వ టీవీ వెల్లడించింది. చర్చల కోసం తాము అమెరికాను ఆహ్వానించామన్న ట్రంప్ వాదనను కూడా ఇరాన్ తోసిపుచ్చింది. కేవలం మధ్యవర్తిగా ఉన్న ఇతర ప్రతినిధుల పర్యటనను మాత్రమే అంగీకరిస్తామని స్పష్టం చేసింది. మరోవైపు ఇరాన్ నేత మహమ్మద్ బమేర్ ఫలిబాఫ్ మరింత తీవ్రమైన వ్యాఖ్యలు చేశారు. అమెరికాతో యుద్ధం ఇరాన్ లొంగిపోవడంతో ఎప్పటికీ ముగియదని ఆయన స్పష్టం చేశారు. "ఒకవేళ అమెరికా ఒప్పందాన్ని ఉల్లంఘిస్తే, మమ్మల్ని మేము రక్షించుకోవడానికి పూర్తిగా సిద్ధంగా ఉన్నాం. వారికి వ్యతిరేకంగా దృఢంగా నిలబడి, ఇరాన్ ప్రజల హక్కులను కాపాడుకుంటాం" అని ఆయన పేర్కొన్నారు. అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాల్ట్ తో చర్చల సమయంలో తమకు వారిపై ఏమాత్రం నమ్మకం లేదని చెప్పినట్లు ఫలిబాఫ్ తెలిపారు. "యుద్ధానికి సిద్ధంగా ఉన్నవారే అమెరికాతో చర్చలు జరపగలరు" అని ఆయన వ్యాఖ్యానించారు. ఇస్లామిక్ రిపబ్లిక్ వ్యవస్థాపకుడు ఆయతుల్లా రుహోల్లా ఖొమేని మనవడు అలీ ఖొమేని కూడా ఇదే తరహాలో స్పందించారు. అమెరికాతో చర్చలు అంటే శాంతి కోసం కాదని, అది కూడా యుద్ధంలో ఒక భాగమేనని అన్నారు. "నేరపూరిత అమెరికాతో మనం శాంతిని ఎలా కోరుకోగలం? అమెరికా శాంతి చర్చలు జరపాలనుకునేవాడు దేశద్రోహి. అమెరికాకు స్నేహ సందేశం పంపేవాడి నేర అవితమైనది" అని ఆయన తీవ్ర వ్యాఖ్యలు చేశారు. గత నెలలో ఇరు దేశాల మధ్య ఒప్పందం కుదిరినప్పటికీ, మధ్యప్రాచ్యంలో పరస్పర దాడులు జరగడంతో కాల్పుల విరమణ ఒప్పందం బలహీనపడింది. మాజీ సుప్రీం లీడర్ అలీ ఖొమేని అంత్యక్రియల సమయం లోతాలి కంగా నిలిచిపోయిన దాడులు, ఆశ్చర్యకరం ముగిసినా మరుసటి రోజు ఇరాన్ లో పేలుళ్లతో మళ్ళీ మొదలయ్యాయి. అయితే, ఈ పేలుళ్లతో తమకు సంబంధం లేదని అమెరికా ప్రకటించింది.

## ఇంగ్లాండ్ గడ్డపై భారత్‌కు

# భంగపాటు..

(మొదటి తరువాయి)

పరిమితమై.. సిరీస్‌లో వైట్ వాష్‌కు గురైంది. వరుసగా నాలుగు మ్యాచులలో గెలిచిన ఇంగ్లాండ్.. సిరీస్‌ను 4-0తో సొంతం చేసుకుంది. ఈ మ్యాచులో టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన ఇంగ్లాండ్ భారీ స్కోరు సాధించింది. నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 257 పరుగుల రికార్డు స్కోరు సాధించింది. ఓపెనర్ జోస్ బట్లర్ (131) విధ్వంసకర శతకంతో కదం తొక్కగా, హ్యారీ బ్రూక్ (95లి) మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు.




వీరిద్దరూ రెండో వికెట్‌కు రికార్డు స్థాయిలో 233 పరుగులు జోడించారు. మరోవైపు భారత బౌలర్లలో ప్రిన్స్ యాదవ్, అక్షర్ పటేల్ దారుణంగా విఫలమయ్యారు. వికెట్లు తీయకపోగా.. భారీగా పరుగులు సమర్పించుకున్నారు. ప్రిన్స్ యాదవ్ 4 ఓవర్లలో 60, అక్షర్ పటేల్ 4 ఓవర్లలో 63 రన్స్ సమర్పించుకున్నారు. శివమ్ దూబె 2 వికెట్లు తీయగా. అర్షదీప్ సింగ్ ఒక వికెట్ తీశాడు. అనంతరం భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన టీమిండియా విజయం కోసం పోరాడింది. అయితే క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోయి.. విజయానికి చాలా దూరంలో నిలిచిపోయింది. అభిషేక్ శర్మ (3), సంజూ శాంసన్ (27) స్వల్ప స్కోరుకే ఔట్ అయ్యారు. కానీ ఇషాన్ కిషన్ (56), తిలక్ వర్మ (53) రాణించడంతో భారత్ స్కోరు 200 పరుగుల మార్కును దాటింది. కానీ సాధించాల్సిన రన్ రేట్ భారీగా పెరిగిపోవడంతో పరాజయం పాలైంది. చివరకు 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 201 పరుగులకు పరిమితమైంది. ఇంగ్లాండ్ బౌలర్లలో సామ్ కర్రన్ 3 వికెట్లు తీశాడు. ఆదిల్ రషీద్ 2 వికెట్లు పడగొట్టగా.. జోఫ్రా ఆర్చర్, జోష్ టంగ్, లియామ్ డాసన్ ఒక్కో వికెట్ తీశారు. ఈ విజయంతో ఇంగ్లాండ్ ఐదు మ్యాచుల సిరీస్‌ను 4-0తో క్లీన్ స్వీప్ చేసింది. తొలి మ్యాచులో వర్షం కారణంగా రద్దు అయింది.

## 14న తెలంగాణ వ్యాప్తంగా

# కళాశాలల బంద్

(మొదటి తరువాయి)

రూ. 11 వేల కోట్ల బకాయిలు పేరుకుపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ప్రతి సంవత్సరం 2 లక్షల మంది విద్యార్థులు డ్రాపౌట్ అవుతున్నారని, వేల మంది సర్టిఫికేట్లు తీసుకోలేక ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు. ప్రైవేట్ కాలేజీలు, ప్రభుత్వం కలిసి విద్యార్థులను మోసం చేస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ కేంద్ర కార్యవర్గ సభ్యులు, రాష్ట్ర నాయకులు మడూరి సందీప్ రావు, జూపల్లి దీపిక, అరిపెల్లి సుజిత్, బెల్లం కార్తీక్, వేల్పుల రాజ్‌కుమార్, గుగులోత్ నవీన్, సిద్దు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర హోదాపై మా సహనాన్ని పరీక్షించొద్దు'..


(మొదటి తరువాయి)



**శ్రీనగర్:**
జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదా విషయంలో తమ సహనాన్ని పరీక్షించవద్దని సీఎం ఒమర్ అబ్దుల్లా కేంద్రాన్ని హెచ్చరించారు. రాష్ట్ర హోదా డిమాండ్‌పై జూలై 20న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరసన కార్యక్రమం చేపడతామని అన్నారు. ఈ కార్యక్రమానికి మద్దతు ఇవ్వాలని అన్ని రాజకీయ పార్టీలకు విజ్ఞప్తి చేశారు. తన అమ్మమ్మ అక్బర్ జహాన్ 26వ వర్ధంతి సందర్భంగా హజ్రత్‌బాల్‌లోని తన తాతా-అమ్మమ్మల సమాధుల వద్ద శనివారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఒమర్ అబ్దుల్లా ప్రసంగించారు. అమ్మమ్మ నుంచి తాను నేర్చుకున్న అతిపెద్ద పాఠం 'సహనం' అని అబ్దుల్లా తెలిపారు. అయితే జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదా పునరుద్ధరణ విషయంలో తన సహనాన్ని బలహీనతగా భావించవద్దని కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు.కాగా, రాష్ట్ర హోదా పునరుద్ధరణకు 'సరైన సమయం' అంటే ఏమిటో కేంద్రం స్పష్టం చేయాలని ఒమర్ అబ్దుల్లా డిమాండ్ చేశారు. లడఖ్ ప్రతినిధులతో చర్చలు జరపడానికి సిద్ధంగా ఉన్న కేంద్రం, జమ్మూకశ్మీర్ ప్రజలతో ఎందుకు చర్చలు జరపడం లేదని ఆయన ప్రశ్నించారు. రాష్ట్ర హోదా డిమాండ్ కోసం జూలై 20న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నేషనల్ కాన్ఫరెన్స్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి మద్దతు ఇవ్వాలని అన్ని రాజకీయ పార్టీలకు విజ్ఞప్తి చేశారు. ఆ రోజున జిల్లా కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని పార్టీ కార్యకర్తలను కోరారు. కేంద్రం చర్చలకు సిద్ధంగా ఉన్నదా? లేదా? అనే దానిపైనే ఈ ఉద్యమ తదుపరి కార్యాచరణ ఆధారపడి ఉంటుందని ఒమర్ అబ్దుల్లా స్పష్టం చేశారు.

# ముద్దుల..మురిపెం!

**- 30 సెకన్లలో 195 ముద్దులు**
**-బ్రెజిల్ జంట అరుదైన ఘనత**
**- గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్‌లోకి ప్రేమ జంట**
**- దీని కోసం రెండేళ్లుగా ప్రాక్టీస్**



ప్రపంచ వ్యాప్తంగా హల్‌చల్
బ్రెజిల్‌కు చెందిన రెనాటో బేమా తన ప్రేయసి రోబెర్టా రిబిరో బుగ్గ్రె అత్యంత వేగంగా ముద్దులు కురిపించి ఈ అరుదైన ఘనతను సాధించారు. ఈ రికార్డు ప్రయత్నం బ్రెజిల్‌లోని సావో జోస్ డాస్ కాంపోస్ నగరంలో గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ అధికారిక ప్రతినిధుల సమక్షంలో జరిగింది. అనంతరం అంతర్జాతీయ కిస్ డే సందర్భంగా ఈ విజయానికి సంబంధించిన వివరాలను అధికారికంగా విడుదల చేయడంతో ఈ వార్త ప్రపంచ వ్యాప్తంగా హల్‌చల్ చేస్తోంది. గిన్నిస్ నిబంధనల ప్రకారం ఈ రికార్డు సాధించడం అంత సులువు కాదు. వారు విధించిన కఠినమైన నిబంధనలున్నాయి. ప్రతి ముద్దు పూర్తిగా వేరుగా ఉండాలి. ఒకసారి ముద్దు పెట్టిన తర్వాత పెదవులు బుగ్గ నుంచి పూర్తిగా విడిపోవాలి. విరామం లేకుండా తదుపరి ముద్దు అంతే వేగంతో కొనసాగించాలి.

సెకనుకు ఆరు ముద్దుల కంటే ఎక్కువగానే..

ఈ కఠినమైన నియమాలను ఎక్కడ ఉల్లంఘించకుండా రెనాటో అత్యంత వేగంగా 30 సెకన్లలో 195 ముద్దులు పూర్తి చేశారు. అంటే లెక్క గడితే ఆయన సెకనుకు ఆరు కంటే ఎక్కువ ముద్దులు పెట్టారన్నమాట.. ఈ అద్భుతమైన వేగం, సమన్వయం చూసి అక్కడ ఉన్న గిన్నిస్ అధికారులు సైతం నోరెళ్లబెట్టారు. పాత రికార్డులు బద్దలు.. తదుపరి లక్ష్యం అదే ఇంతకుముందు ఈ రికార్డు ఒక బ్రిటిష్ జంట పేరిట ఉండేది. వారు 30 సెకన్లలో 146 ముద్దులు పెట్టి రికార్డు సృష్టించగా ఈ బ్రెజిల్ జంట ఏకంగా 49 ముద్దుల భారీ తేడాతో ఆ రికార్డును తిరగరాసింది. 'చూడటానికి ఇది కేవలం ఒక సరదా రికార్డుల అనిపించినా దీని వెనుక అత్యంత కఠినమైన క్రమశిక్షణ, సమన్వయం, నెలల తరబడి చేసిన ప్రాక్టీస్ ఉన్నాయి.' అని గిన్నిస్ ప్రతినిధులు రికార్డును ఆ ముద్దుల మాపయ్య చేతిలో పెట్టారు.

## షాబాద్‌లో

# రక్తపాతం

(మొదటి తరువాయి)

బాధిత బాలిక కుటుంబానికి రక్ష?ణ కల్పించకపోవడంతోనే దుండగుడు ఈ మారణహోమం సృష్టించాడంటూ గ్రామస్తులు ఆందోళనకు దిగారు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఓ బాలికపై లైంగిక వేధింపుల కేసులో దైవాలగూడకు చెందిన రాజ్‌కుమార్‌పై మే16న పోక్సో చట్టం కింద కేసు నమోదైంది. అనంతరం అతడు బెయిల్ పొందాడు. తనపై కేసు నమోదు చేయించారనే కక్షతో శనివారం తెల్లవారుజామున షాబాద్ పీఆర్ఆర్ స్టేడియం సమీపంలోని బాలిక ఇంట్లోకి చొరబడ్డాడు. ముందుగా తనపై ఫిర్యాదు చేసిన చిట్యాల లక్ష్మి(45), ఆమె అత్త రుక్కమ్మ (65)ను కత్తితో పొడిచి హత్య చేశాడు. ఆ తర్వాత బాలిక(17)ను దైవాలగూడ సమీపంలోని చెరువు వద్దకు తీసుకెళ్లి హత్య చేశాడు. అదే ఇంట్లో ఉన్న లక్ష్మీ పెద్ద కూతురు మానసిక వికలాంగురాలైన మేఘనను వదిలేశాడు. ఆ తర్వాత తన ఇంటికి వెళ్లి భార్య సరిత(30), ఇద్దరు పిల్లలు పరీక్ష?త్(4), దైవిక్ష?త్ (2)ను కత్తితో పొడిచి చంపాడు. అనంతరం పారిపోయాడు. కొంత దూరం వెళ్లాక.. తన తండ్రికి ఫోన్ చేసి ఆరుగురిని హత్య చేశానని, తాను ఆత్మహత్య చేసుకుంటానని చెప్పి ఫోన్ స్విచ్ ఆఫ్ చేశాడు. అతను వెంటనే పోలీసులకు సమాచారం అందించాడు. పోలీసులు ఘటనా స్థలాలకు చేరుకుని పరిశీలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం చేవెళ్ల, ఉస్మానియా ఆస్పత్రులకు తరలించారు. నిందితుడి కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు చేపట్టారు. నిందితుడు సరితను ప్రేమ వివాహం చేసుకున్నాడు.

ఉన్నతాధికారుల పర్యవేక్షణ

ఘటనా స్థలాన్ని ఫ్యూచర్ సిటీ కమిషనర్ తరుణ్ జోషి సందర్శించి, పరిస్థితిని సమీక్షించారు. జాయింట్ సీపీ చందనా దీప్తి, చేవెళ్ల డీసీపీ యోగేష్ గౌతమ్, షాద్‌నగర్ డీసీపీ శిరీష, ఏసీపీ లక్ష్మీనారాయణ, ఇతర పోలీసు అధికారులు, క్లూస్ టీం సభ్యులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. చేవెళ్ల ఆర్డీవో పార్థసారథి రెడ్డి కూడా ఘటనా స్థలాన్ని సందర్శించారు.

పోలీసుల నిర్లక్ష్యంపై ఆగ్రహం

పోక్సో కేసు నమోదైనప్పటికీ నిందితుడిపై తగిన నిఘా పెట్టలేదని ఆరోపిస్తూ బాధిత కుటుంబ సభ్యులు, గ్రామస్తులు షాబాద్ ప్రధాన చౌరస్తాలో రాస్తారోకో చేశారు. నిందితుడిని వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని, బాధ్యులైన పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిందితుడికి కఠిన శిక్ష పడే వరకూ ఆందోళన విరమించబోమని స్పష్టం చేశారు. రాస్తారోకోలో మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, పట్నం అవినాష్ రెడ్డి, బర్క కృష్ణ, రాము, తమ్మలి రవీందర్, వెంకట్ యాదవ్, జడల రాజేందర్ గౌడ్, రాహుల్ గుప్తా, దేవేందర్ రెడ్డి, గౌరీ, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు. బాధిత కుటుంబ సభ్యుల రోదనలతో షాబాద్ చౌరస్తా హృదయ విదారకంగా మారింది.

# పారుతున్న నీళ్లను ఎత్తిపోస్తే బ్యారేజీలు ఎందుకు?

(మొదటి తరువాయి)



మీటర్ల ఎత్తులో నీరు నిలిపితేనే ఎత్తిపోతలు సాధ్యం అవుతుందన్నారు. ఈటల రాజేందర్ అంటే మాకు గౌరవమే కానీ కాళేశ్వరం విషయంలో ఆయన చేసిన వ్యాఖ్యలతో రాజేందర్ తన గౌరవం కోల్పోయారన్నారు. హరీష్ రావు సూచనలతో ఈటల రాజేందర్ మాట్లాడారాని కాళేశ్వరంపై రాజేందర్ అవాస్తవాలు చెప్పారన్నారు. బీఆర్ఎస్ నేతల వాదననే బీజేపీ ఎంపీ ఈటల వినిపించారన్నారు. మేడిగడ్డలో లోపాలు ఉన్నాయని ప్రాజెక్టు ప్రారంభించిన 11 నెలల్లోనే లోపాలు ఉన్నట్లు గత ప్రభుత్వంలో ఈఈ రమణారెడ్డి లేఖ రాశారని రేవంత్ రెడ్డి చెప్పారు. మేడిగడ్డ బ్యారేజీలో లోపాలు సరిచేయకుంటే ఇబ్బందని లేఖలో పేర్కొన్నారన్నారు. నాడు రాసిన లేఖ పట్ల నిర్లక్ష్యం వహించడం వల్లే మేడిగడ్డ కుప్పకూలిందన్నారు.
మేడిగడ్డలో ఉన్న లోపాలను ఎత్తిచూపుతూ ఎన్డీఎస్ఏ నివేదిక ఇచ్చిందని ప్లానింగ్, డిజైన్, నిర్మాణంలో లోపాలు ఉన్నట్లు ఎన్డీఎస్ఏ నివేదిక ఇచ్చిందన్నారు. 2022 జూలైలో కన్నెపల్లి పంప్ హౌస్ మునిగిపోతే సరిచేయలేదన్నారు. ఎన్డీఎస్ఏ క్షేత్రస్థాయిలో పనిచేసేలా 2021 లో కేంద్రం చట్టం చేసింది. ఎన్డీఎస్ఏ మేడిగడ్డను సందర్శించి.. అందులో నీటి నిల్వ సాధ్యం కాదని చెప్పిందన్నారు. సీడబ్ల్యూసీ ప్రకారమే ప్రాజెక్టుపై ముందుకెళ్లాలని ఎన్డీఎస్ఏ చెప్పింది. 80 వేల పుస్తకాలు చదివిన మేధావుల మాటలుగాని.. ఖిలాడీ కమిటీల సూచనలు గానీ పట్టించుకోవద్దని ఎన్డీఎస్ఏ చెప్పిందన్నారు. ఎత్తిపోతలు అంటే ఏంటో అమెరికాలో చదివిన కేటీఆర్ కు తెలియదా అని ప్రశ్నించారు. ఎన్డీఎస్ఏ నివేదిక మేరకే కమిటీ వేసి బ్యారేజీల పునరుద్ధరణకు యత్నిస్తున్నామన్నారు. మమ్మల్ని బద్నాం చేయడానికి ప్రయత్నిస్తున్నారని తెలంగాణ ప్రజల ముందు 2 కమిటీలు ఉన్నాయని ఒకటి కిలాడీ కమిటీ రెండోది ఎన్డీఎస్ఏ వేసిన కమిటీ ఉందన్నారు. కిలాడీ కమిటీలో కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావు ఈటల సభ్యులుగా ఉన్నారని మండిపడ్డారు.

# రైతాంగాన్ని నిలువునా ముంచుతున్న సీఎం

(మొదటి తరువాయి)





ఎల్ నినో ప్రభావం ఉన్నప్పటికీ ప్రకృతి ప్రసాదించిన ఈ ప్రవాహం మరో 100 రోజులు ఇలాగే ఉంటుందని తెలిపారు. రోజుకు 2 టీఎంసీల చొప్పున మొత్తం 200 టీఎంసీల నీటిని ఎత్తిపోస్తే.. గోదావరి బేసిన్లోని అన్నారం, సుందిళ్ల, ఎల్లంపల్లి, మిడ్ మానేరు వంటి అన్ని జలాశయాలను నింపి తెలంగాణను సస్యశ్యామలం చేయవచ్చని కేటీఆర్ వివరించారు. రాష్ట్రంలో నీళ్లు లేక రైతులు ఏడుస్తుంటే, కాళేశ్వరం ప్రాజెక్టును బద్నాం చేయాలనే కుట్రతో సీఎం రేవంత్ రెడ్డి నీళ్లివ్వడం లేదని కేటీఆర్ ధ్వజమెత్తారు. ఇది కాలం తెచ్చిన కరువు కాదు.. కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన కరువు అని ఎద్దేవా చేశారు. 2022 వరదల ఫోటోలు చూపించి కన్నెపల్లి మునిగిపోయిందంటూ అడ్డమైన మాటలు మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. పోలవరం ప్రాజెక్టు వల్ల మునిగే భద్రాచలాన్ని పట్టుకుని.. మేడిగడ్డ వల్లే మునుగుతోందని బుర్రలేని మాటలు రేవంత్ మాట్లాడుతుండని కేటీఆర్ ఫైర్ అయ్యారు. గోదావరిలో లక్షల క్యూసెక్కుల వరద నీరు కళ్లముందు కిందికు పోతుంటే.. ఎత్తిపోయడానికి నీళ్లు లేవనేవాడు బుర్రతక్కువ వాడా? లేక రైతుల కోసం నీళ్లివ్వమనేవాడు బుర్రతక్కువ వాడా? అని కేటీఆర్ అన్నారు. ఇక మాజీ మంత్రి హరీశ్ రావు పై వస్తున్న పుకార్లను కేటీఆర్ గట్టిగా తిప్పికొట్టారు. హరీశ్ రావు పార్టీ ఆవిర్భావం కంటే ముందు నుంచే కేసీఆర్కు రక్షణ కవచంగా నిలిచిన సైనికుడని కేటీఆర్ కొనియాడారు. తనపై వచ్చిన పుకార్లను ఆయన వందల సార్లు తిప్పికొట్టారని అన్నారు. తమకు క్యారెక్టర్ చాలా ముఖ్యమని అన్నారు. నాలుగు పార్టీలు మారిన రేవంత్ రెడ్డి.. హరీశ్ రావు శీల పరీక్ష గురించి మాట్లాడటం హాస్యాస్పదమని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి ఢిల్లీకి పోతే పొద్దున కాంగ్రెస్‌తో, రాత్రికి బీజేపీ వాళ్లతో ఉంటారని.. శీల పరీక్ష చేయాల్సింది రేవంత్ రెడ్డికేనని ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డి పాలన ఇలాగే ఉంటే రాబోయే రోజుల్లో కాంగ్రెస్‌కు 117 అసెంబ్లీ స్థానాలు కాదు కదా.. కనీసం 7 సీట్లు కూడా రావని కేటీఆర్ కామెంట్ చేశారు.

## మరాఠీ రాకుంటే..

# డ్రైవింగ్ లైసెన్స్ రద్దు!

(మొదటి తరువాయి)



ప్రధానంగా హిందీని వ్యతిరేకిస్తున్న మరాఠీ భాషాభిమానులు మాతృభాషపై ఉద్యమాలు చేస్తున్నారు. దీంతో ప్రభుత్వం స్థానిక భావోద్వేగాన్ని దృష్టిలో పెట్టుకుని ఈ సంచలన నిర్ణయం తీసుకుందని చెబుతున్నారు. మహారాష్ట్రలోని ఆటో రిక్షా, టాక్సీ డ్రైవర్లందరికీ మరాఠీ భాషా ప్రావీణ్యం తప్పనిసరి చేస్తూ రవాణా శాఖ జారీ చేసిన ఉత్తర్వులు ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. భాషా సంస్కృతిని కాపాడుకోవాలనే సాకుతో తీసుకున్న ఈ నిర్ణయం, ఉపాధి కోసం ఇతర రాష్ట్రాల నుంచి మహారాష్ట్రకు వలస వచ్చిన లక్షలాది మంది డ్రైవర్ల భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తోందన్న ఆగ్రహానికి కారణమవుతోంది. ఆగస్టు 16వ తేదీ లోపు మరాఠీ భాషా పరీక్షలో ఉత్తీర్ణత సాధించని డ్రైవర్ల లైసెన్సులు, బ్యాడ్జీలను రద్దు చేస్తామని రవాణా మంత్రి ప్రతాప్ స్పష్టం చేశారు. గతంలో ఈ నిబంధన ఉన్నప్పటికీ, ఉల్లంఘించిన వారికి కేవలం 500 రూపాయల జరిమానాతో సరిపెట్టేవారు. కానీ ఇప్పుడు, కేవలం జరిమానాతో కాకుండా నేరుగా లైసెన్సు రద్దు చేయడం ద్వారా వలస డ్రైవర్లపై ప్రభుత్వం కత్తి వేలాడదీసిందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో, నాన్ మరాఠీ డ్రైవర్లకు భాష నేర్పించేందుకు ప్రభుత్వం 450 మంది ఉపాధ్యాయులను నియమించినట్లు చెబుతున్నారు. ఈ నిర్ణయం వెనుక ఉన్న ఉద్దేశంపై నెట్టింట భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం వాదిస్తున్న దాని ప్రకారం, ప్రయాణికులతో, ముఖ్యంగా స్థానిక ప్రజలతో మెరుగ్గా కమ్యూనికేట్ చేయడానికి డ్రైవర్లకు స్థానిక భాష వచ్చి ఉండటం అవసరమని అంటున్నారు. ఇది ప్రయాణికుల భద్రత, సౌకర్యానికి మేలు చేస్తుందని, సంస్కృతిని పరిరక్షించే బాధ్యత తమదని అధికార పక్షం వాదిస్తోంది. అయితే, ప్రభుత్వ నిర్ణయాన్ని విపక్షాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. ఇది కేవలం వలస కార్మికులను వేధించడానికి, రాజకీయంగా లబ్ధి పొందడానికి వేస్తున్న ఎత్తుగడ అని వారు ఆరోపిస్తున్నారు.

# విద్యార్థుల భద్రతే లక్ష్యం.. 'పోలీస్ అక్క'తో అవగాహన.



**మెదక్ జిల్లా -11జూలై (మహాప్రభ )**
మెదక్ జిల్లా పోలీసు శాఖ చేపట్టిన 'పోలీస్ అక్క' కార్యక్రమంలో భాగంగా మనోహరాబాద్ పోలీస్ స్టేషన్‌కు చెందిన మహిళా పోలీసు కానిస్టేబుల్ తస్లీమా స్థానిక జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాల విద్యార్థులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యక్తిగత భద్రత, గుడ్ టచ్--బ్యాడ్ టచ్, సైబర్ నేరాల నుంచి రక్షణ, సోషల్ మీడియాను బాధ్యతాయుతంగా వినియోగించడం, మాదకద్రవ్యాల దుష్పరిణామాలు, అపరిచితుల పట్ల అప్రమత్తంగా ఉండాల్సిన అవసరంపై అవగాహన కల్పించారు. అలాగే పాఠశాల, ఇల్లు లేదా ఇతర ప్రదేశాల్లో ఎలాంటి వేధింపులు, బెదిరింపులు లేదా అనుమానాస్పద పరిస్థితులు ఎదురైనా భయపడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా పోలీసులకు వెంటనే సమాచారం ఇవ్వాలని సూచించారు. పోలీసులు విద్యార్థుల భద్రతకు ఎల్లప్పుడూ అండగా ఉంటారని, సహాయం అవసరమైన ప్రతి సందర్భంలో నిర్భయంగా 'పోలీస్ అక్క' లేదా సమీప పోలీసు సిబ్బందిని సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని పలు సందేహాలను అడిగి నివృత్తి చేసుకున్నారు.

# సీజనల్ వ్యాధులపై అవగాహన

**రామాయంపేటపట్టణం లో 7వ వార్డు, గోలివర్తి**



**రామాయంపేట జూలై 11 మహా ప్రభ**
**వివరాలు:**
పట్టణంలోని 7వ వార్డు గోలివర్తిలో శుక్రవారం సీజనల్ వ్యాధుల నివారణపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.
గతంలో గ్రామంలో నలుగురు డెంగ్యూ, మలేరియా బారిన పడిన నేపథ్యంలో వైద్యులు, మున్సిపల్ చైర్‌పర్సన్ మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులను నివారించవచ్చని తెలిపారు.
**సూచనలు:**
- ఇళ్లలో నీరు నిల్వ ఉండే కుండీలు, పాత టైర్లు, కొబ్బరి చిప్పలు, ఉపయోగంలో లేని వస్తువులు తొలగించాలని సూచించారు.
- రోడ్లపై గుంతల్లో వర్షపు నీరు నిల్వ ఉంటే వెంటనే మున్సిపల్ కార్యాలయానికి సమాచారం అందించాలని కోరారు.

**పాల్గొన్నవారు:**
మున్సిపల్ చైర్‌పర్సన్ గజవాడలావణ్య నాగరాజు, కౌన్సిలర్లు గుగులోత్ రవి, పుట్టి సందీప్, దేవుని రంజిత్, డీసీసీ ఉపాధ్యక్షులు చింతల యాదగిరి, డీసీ కార్యదర్శి పోచమ్మల గణేష్, మాజీ పట్టణ అధ్యక్షులు దాసి స్వామి, మాజీ కౌన్సిలర్ బోర్ర అనిల్, సీనియర్ నాయకులు చింతల స్వామి, తోంటవాలి యాదగిరి, పరశురాములు, యూత్ కాంగ్రెస్ నాయకులు విరాట్, భాను, నరేందర్, సుధీర్ గౌడ్, గణేష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# కుమ్మర్ల తొలి బోనం జాతరకు ముఖ్య అతిథిగా నాగపరిమళకు ఆహ్వానం.



**ఎల్‌బినగర్ - జూలై 11 (మహప్రభ)**
కుమ్మర్ల తొలి బోనం జాతరను వైభవంగా నిర్వహించనున్న సందర్భంగా, మన కుమ్మర్ల ఆడపడుచు నాగపరిమళ ని ముఖ్య అతిథిగా పాల్గొనాల్సిందిగా బోనాల ఉత్సవ కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రచార కార్యదర్శులు ఎగ్రిశెట్టి వీరయ్య , నిమ్మలూరి శ్రీనివాస్ , బోనాల ఉత్సవ కమిటీ కన్వీనర్ ఆదల గణేశ్ , కో-కన్వీనర్లు ఎగ్రిశెట్టి బాలరాజు మరియు సంగెం లడ్డు నాగపరిమళ ని కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. కుమ్మర్ల తొలి బోనం జాతరను సంప్రదాయబద్ధంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. ఈ జాతర కుమ్మర్ల ఐక్యతకు, సంస్కృతి పరిరక్షణకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా శ్రీమతి నాగపరిమళ ఆహ్వానం పలికిన కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేస్తూ, కుమ్మర్ల తొలి బోనం జాతరకు తప్పకుండా హాజరై జాతర విజయవంతానికి తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో బోనాల ఉత్సవ కమిటీ సభ్యులు, సంఘ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా కాంగ్రెస్ కమిటీ నూతన పదవులకు ఎంపికైన నాయకులకు ఎమ్మెల్యే హృదయపూర్వక శుభాకాంక్షలు



**దేవరకొండ జూలై 11( మహా ప్రభ)**
"నల్లగొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ"లో నూతనంగా వివిధ బాధ్యతలకు నియమితులైన జిల్లా కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షులు: 1) ఆలంపల్లి నర్సింహా ,2)ముక్కమల్ల వెంకటయ్య గౌడ్ , ప్రధాన కార్యదర్శులు: 1) కుక్కల గోవర్ధన్ రెడ్డి , 2) హనుమంతు వెంకటేష్ గౌడ్ 3) ఊట్కూరు వేమన్ రెడ్డి 4) ఎరుకల వెంకటయ్య గౌడ్ , 5) మేకల రాజేందర్ రెడ్డి 6) కసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి అధికార ప్రతినిధి: 1) ముచర్ల యాదగిరి కార్యదర్శులు: 1) జర్పుల భద్య నాయక్ , 2) నల్లవెల్లి రాజేష్ రెడ్డి , 3) లోకసాని కృష్ణయ్య 4) వీరబోయిన యల్లయ్య యాదవ్ , 5) మద్దిమడుగు రామస్వామి కి దేవరకొండ శాసనసభ్యులు నేనావత్ బాలు నాయక్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు నూతనంగా బాధ్యతలు చేపట్టిన నాయకులు అంకితభావంతో పనిచేయాలని ఆకాంక్షించారు. పార్టీ బలోపేతమే లక్ష్యంగా గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ప్రతి కార్యకర్తతో సమన్వయం చేసుకుంటూ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ కోసం నిస్వార్థంగా, క్రమశిక్షణతో, కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తను పార్టీ నాయకత్వం తప్పకుండా గుర్తిస్తుందని, వారి సేవలకు తగిన గౌరవం, బాధ్యతలు, పదవులు లభిస్తాయని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీలో కార్యకర్తల కష్టానికి ఎప్పుడూ విలువ ఉంటుందని, పార్టీ అభివృద్ధి కోసం శ్రమించే వారికి భవిష్యత్తులో మరిన్ని అవకాశాలు వస్తాయని అన్నారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన నాయకులందరూ జిల్లా కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసి, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు సమిష్టిగా కృషి చేయాలని ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ పిలుపునిచ్చారు

# విద్యార్థులకు బ్యాగులు అందజేసిన యూత్ ఫర్ సేవ ముఖ్య సలహాదారుడు ప్రొఫెసర్ మల్లికార్జున్ రెడ్డి.



**మెదక్ జిల్లా -11జూలై (మహాప్రభ )**
మెదక్ జిల్లా సీతారాం తండా గ్రామంలో స్కూల్ విద్యార్థులకు స్కూల్ బ్యాగ్,నోట్ పుస్తకాల పంపిణీ యూత్ ఫర్ సేవ ముఖ్య సలహాదారుడు ప్రొఫెసర్ మల్లికార్జున్ రెడ్డి పంపిణి చేశారు. ఈ సందర్భంగా గీతం విశ్వవిద్యాలయం వారు మాట్లాడుతూ .. యూత్ ఫర్ సేవ అనేది యువతలో సేవా భావాన్ని పెంపొందించి,సమాజ అభివృద్ధికి వారిని భాగస్వాములుగా చేసే స్వచ్ఛంద సేవా సంస్థ,ఇది 2007 లో స్థాపించబడింది.
విద్య,ఆరోగ్యం,గ్రామీణాభివృద్ధి,పర్యావరణ పరిరక్షణ,ఉపాధి,యువజన నాయకత్వ వికాసం వంటి అనేక రంగాలలో సేవలు అందిస్తోంది. స్వచ్ఛంద సేవకులను సమాజ అవసరాలకు అనుసంధానం చేసి,సేవా కార్యక్రమాలలో పాల్గొనేలా ప్రోత్సహిస్తుందని పాఠశాలల అభివృద్ధి,విద్యార్థులకు మార్గదర్శకత్వం,మొక్కల నాటడం,పరిశుభ్రత కార్యక్రమాలు,నైపుణ్యాభివృద్ధి శిక్షణలు వంటి అనేక కార్యక్రమాలను నిర్వహిస్తోంది. సమాజం పట్ల బాధ్యత,కరుణ,సేవా దృక్పథం,నాయకత్వ లక్షణాలను యువతలో పెంపొందించడం ఈసంస్థ ప్రధాన లక్ష్యం. ప్రతి పౌరుడు సమాజ అభివృద్ధికి తన వంతు బాధ్యతను నిర్వర్తించాలనే భావనను ఈ సంస్థ ప్రోత్సహిస్తుంది. సేవ ద్వారా వ్యక్తిత్వ వికాసంతో పాటు సమాజంలో సానుకూల మార్పును తీసుకురావడమే యూత్ ఫర్ సేవ యొక్క ప్రధాన ధ్యేయం అని తెలియజేశారు. స్కూల్ బ్యాగుల పంపిణీ కమల్ సురేష్ ప్రత్యేక చొరవతో చేయడం జరిగిందని తెలుపుతూ రానున్న రోజుల్లో యూత్ ఫర్ సేవా తరపున మరిన్ని సహాయ కార్యక్రమాలు చేస్తామని తెలియజేశారు. ఈకార్యక్రమంలో అభావిప ఆల్ ఇండియా స్టేట్ యూనివర్సిటీ స్ కో కన్వీనర్ కమల్ సురేష్ సర్పంచ్ కంఠీమోహన్,స్కూల్ హెడ్మాస్టర్ యాదగిరి.కార్యకర్తలు తేజ,విశాల్,గ్రామ పెద్దలు కేతావత్ లక్ష్మణ్,రవి,రాజు,మంగీలాల్,ఫుల్ సింగ్,అంజి,హరియా,సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# ఓటరు ఎన్యూమరేషన్ ఫారం తప్పనిసరిగా నింపాలి

**-ప్రతి ఓటరు తన ఓటు హక్కును కాపాడుకోవాలి**
**- బీఆర్ఎస్ నాయకుడు ఆంజనేయులు**



**మెదక్ జిల్లా - 11జూలై (మహాప్రభ**
ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారతదేశంలో ఓటు హక్కు ప్రతి పౌరునికి అత్యంత విలువైన రాజ్యాంగబద్ధమైన హక్కు. దేశ భవిష్యత్తు ప్రజల ఓటు ద్వారానే నిర్ణయించబడుతుంది. అలాంటి ఓటు హక్కు విషయంలో ఏ ఒక్కరూ నిర్లక్ష్యం వహించకూడదని మెదక్ పట్టణ బిఆర్ఎస్ పార్టీ కన్వీనర్, 5వ వార్డు కౌన్సిలర్ మామిళ్ల ఆంజనేయులు పిలుపునిచ్చారు.
భారత ఎన్నికల సంఘం చేపట్టిన ఎస్ఐఆర్ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఓటరు తన ఎన్యూమరేషన్ ఫారాన్ని తప్పనిసరిగా నింపి సంబంధిత బీఎల్ఓకు అందజేయాలని ఆయన కోరారు. ఫారం నింపకపోతే భవిష్యత్తులో ఓటరు జాబితాలో పేరు కొనసాగడంపై ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరూ బాధ్యతగా స్పందించాలని సూచించారు.ప్రస్తుతం బీఎల్ఓలు సేకరిస్తున్న వివరాలను ఎన్నికల సంఘం యాప్‌లో నమోదు చేసి పత్రాలను అప్‌లోడ్ చేయడానికి ఎక్కువ సమయం పడుతోందని, ఈ పరిస్థితుల్లో ప్రస్తుత గడువులోనే మొత్తం ప్రక్రియను పూర్తి చేయడం కష్టసాధ్యమని తెలిపారు. అందువల్ల మెదక్ పట్టణ ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని, ప్రతి అర్హులైన ఓటరికి అవకాశం కల్పించేలా ఎస్ఐఆర్ కార్యక్రమం గడువును కేంద్ర ఎన్నికల సంఘం మరికొంత కాలం పొడిగించాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే మెదక్ పట్టణంలోని ప్రతి ఓటరు ఎన్యూమరేషన్ ఫారం నింపి ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగస్వాములు కావాలని మామిళ్ల ఆంజనేయులు విజ్ఞప్తి చేశారు. ఐదో వార్డ్ లోని 134 బూత్ అధికారి శైలజ ఆధ్వర్యంలో ఓటర్లకు ఎన్నిమరేషన్ పత్రాలను పంపిణీ చేశారు మొత్తం 1143 మంది ఓటర్లు ఉన్నారు.

# శ్రీ భద్రకాళి దేవాలయానికి భారీ రథం తయారీ...!




**ఉమ్మడి వరంగల్ 11జూలై (మహాప్రభ )**
వరంగల్ నగరంలోని చారిత్రక భద్రకాళి అమ్మవారి దేవాలయానికి భారీ రథాన్ని తయారు చేయిస్తున్నారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి,తన బంధువులు, స్నేహితులతో కలిసి విరాళంగా 1.30 రూపాయలు అందించనున్నారు. దీంతో బల్లార్షా నుంచి తెప్పించిన నారా వేప, టేకు కల్పతో 12ం12 అడుగుల వెడల్పు, 24 అడుగుల ఎత్తులో రథాన్ని నిర్మిస్తున్నారు. ఈ రథాన్ని నిర్మించడానికి కన్యాకుమారి, సిద్దిపేట చెందిన శిల్ప కళాకారులను రప్పించారు. ఆలయం ఆవరణలో శిల్పకారులు పనులు చేస్తున్నారు. రథాన్ని భక్తులు ఆసక్తికరంగా తిలకిస్తున్నారు.

# ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలోజిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్ ఘనంగా జన్మదిన వేడుకలు.



**మెదక్ జిల్లా -11జూలై (మహాప్రభ ).**
మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ రథసారథి జిల్లా అధ్యక్షులు శివన్న గారి ఆంజనేయులు గౌడ్ జన్మదినం సందర్భంగా ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులో జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మెదక్ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మందు గుల. గంగాధర్, పాపన్నపేట మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు లింగంపేట నరేంద్ర గౌడ్, హవేలీ ఘన్పూర్ మండల పార్టీ అధ్యక్షులు గుండారం కిరణ్ గౌడ్, మెదక్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు. మార్గం నాగరాజు , శంకరంపేట మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు హలవత్ మోహన్ నాయక్,మెదక్ మండల సీనియర్ నాయకులు రమేష్, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు పరశురాం గౌడ్, మాజీ ఉపసర్పంచ్ కలీముద్దీన్ , ముశెట్టి కిష్టయ్య ప్రవీణ్ గౌడ్, షేక్ అక్బర్ మొయూద్దీన్, మహేష్, మెదక్ మండలం సర్పంచ్ ఫోరంల అధ్యక్షుడు యాదగిరి తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు

# బాధిత కుటుంబానికి మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్ రెడ్డి రూ.5 వేల ఆర్థిక సాయం.



**మెదక్ జిల్లా -11జూలై (మహాప్రభ )**
పేరూరు గ్రామానికి చెందిన తిప్పపురం పోచమ్మ అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందిన విషయం స్థానిక నాయకుల ద్వారా తెలుసుకున్న మాజీ డిప్యూటీ స్పీకర్ ఎం. పద్మా దేవేందర్ రెడ్డి స్పందించారు.గ్రామ బీఆర్ఎస్ నాయకుల ద్వారా శనివారం బాధిత కుటుంబానికి రూ.5 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పోచమ్మ మృతిపట్ల పద్మా దేవేందర్ రెడ్డి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసి, వారికి మనోధైర్యంగా ఉండాలని సూచించారు.ఆర్థిక సాయాన్ని గ్రామ పార్టీ అధ్యక్షుడు గౌండ్ల యాదగౌడ్, మాజీ ఉపసర్పంచ్ ఏగొండ, మాజీ ఎంపీటీసీ యాదగిరి, పుట్టి భాగయ్య, వార్డు సభ్యుడు గడ్డమీద రాజు, అనిల్, రమణ, శేఖర్, సూప లచ్చయ్య బాధిత కుటుంబానికి అందజేశారు.

## గుడ్ మార్నింగ్ గడ్డిఅన్నారం కార్యక్రమంలో ఓటు పరిరక్షణపై అవగాహన

**ఎస్ఐఆర్ హెల్ప్ డెస్క్‌లను వినియోగించుకోవాలని భవాని ప్రవీణ్ కుమార్ పిలుపు.**




**గడ్డి అన్నారం – జూలై 11 (మహాప్రభ)**
గుడ్ మార్నింగ్ గడ్డిఅన్నారం కార్యక్రమంలో భాగంగా బీఆర్ఎస్ పార్టీ గడ్డిఅన్నారం డివిజన్ మాజీ కార్పొరేటర్ భవాని ప్రవీణ్ కుమార్ ఈరోజు ఉదయం డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో పర్యటించి స్థానిక ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఓటును రక్షించుకుందాం ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేద్దాం అనే సందేశంతో ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును పరిరక్షించుకోవాలని పిలుపునిచ్చారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అలాగే, ఈరోజు నుంచి బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో గడ్డిఅన్నారం డివిజన్‌లో ఏర్పాటు చేయనున్న ఎస్ ఐ ఆర్ హెల్ప్ డెస్క్‌లను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఓటరు ఫారాల పూరణ, వివరాల సవరణ, సందేహాల నివృత్తి తదితర అంశాల్లో హెల్ప్ డెస్క్‌ల ద్వారా అవసరమైన సహాయం అందించనున్నట్లు తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, ప్రతి ఇంటికి చేరువయ్యే లక్ష్యంతో గుడ్ మార్నింగ్ గడ్డిఅన్నారం కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నామని భవాని ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు.

## క్వీన్ బాస్కెట్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించిన మాజీ కార్పొరేటర్ నాయకోటి పవన్ కుమార్

**-మహిళల స్వయం ఉపాధికి సంపూర్ణ మద్దతు ప్రకటించిన బీజేపీ నేత**






**కొత్తపేట –జూలై 11 (మహప్రభ)**
కొత్తపేట డివిజన్ పరిధిలోని రాజధాని గార్డెన్స్‌లో కృష్ణవేణి ఆధ్వర్యంలో నిర్వహించిన క్వీన్ బాస్కెట్ ఎగ్జిబిషన్ కార్యక్రమానికి కొత్తపేట డివిజన్ మాజీ కార్పొరేటర్ నాయకోటి పవన్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎగ్జిబిషన్‌లో ఏర్పాటు చేసిన హస్తకళ ఉత్పత్తులు, గృహోపకరణాలు, మహిళల స్వయం ఉపాధి ఉత్పత్తులు, ఆహార పదార్థాల స్టాల్స్‌ను పరిశీలించి నిర్వాహకులను అభినందించారు. మహిళల్లో ఉన్న సృజనాత్మకత, ప్రతిభ, వ్యాపార నైపుణ్యాలను వెలికితీసి వారికి ప్రోత్సాహం అందించే ఇలాంటి కార్యక్రమాలు సమాజాభివృద్ధికి ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నాయకోటి పవన్ కుమార్ మాట్లాడుతూ, నేటి మహిళలు అన్ని రంగాల్లో తమ ప్రతిభను చాటుకుంటూ స్వయం ఉపాధి ద్వారా ఆర్థికంగా ఎదుగుతున్నారని అన్నారు. మహిళలకు తమ ఉత్పత్తులను ప్రజలకు పరిచయం చేసుకునే అవకాశాన్ని కల్పించే వేదికలుగా ఇటువంటి ఎగ్జిబిషన్లు నిలుస్తాయని తెలిపారు. స్థానికంగా తయారయ్యే ఉత్పత్తులను ప్రజలు ఆదరించి కొనుగోలు చేయడం ద్వారా మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కొత్తపేట డివిజన్ బీజేపీ అధ్యక్షులు మంచి రాజేష్ కుమార్ , మహిళా నాయకురాలు కాట విజయ గౌడ్ , వైజయంతి , కవిత రెడ్డి , యశోద , పుష్పమ్మ , బీజేపీ నాయకులు వగ్గుల సుందర్ నారాయణ , అశ్విన్ సింగ్ , పలువురు పార్టీ కార్యకర్తలు, మహిళా పారిశ్రామికవేత్తలు మరియు పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలి

**డిమాండ్ చేసిన సామాజికవేత్త, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్**



**దేవరకొండ జూలై 11( మహా ప్రభ)**
దేవరకొండ పట్టణంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో తెలంగాణ అమరవీరుల స్థూపం ముందు పెండింగ్లో ఉన్నటువంటి స్కాలర్షిప్స్, ఫీజు రీఎంబర్స్మెంట్ తక్షణమే విడుదల చేయాలని నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సామాజికవేత్త బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాలుగా పెండింగ్లో ఉన్నటువంటి ఫీజు రియంబర్స్మెంట్, స్కాలర్షిప్లను తక్షణమే విడుదల చేయాలి ప్రభుత్వము అనేక కార్యక్రమాలకు బడ్జెట్ను విడుదల చేస్తుంది కానీ విద్యార్థుల భవిష్యత్తు కోసం ఆలోచన చేయకుండా విద్యార్థులు స్కాలర్షిప్ల కోసం రోడ్లకే దుస్థితి తీసుకొచ్చిందని అన్నారు. తక్షణమే ప్రభుత్వం పెండింగ్లో ఉన్నటువంటి స్కాలర్షిప్ ను విడుదల చేయకపోతే, పాత విధానంలో ఫీజు రియంబర్స్మెంట్ పథకాన్ని అమలు చేయకపోతే జాతీయ రహదారులను దిబ్బంధం చేసి, ప్రభుత్వ పాలన స్తంభింపచేస్తామని అన్నారు.

## ఎస్ఐఆర్ కార్యక్రమంలో ఓటరు ఫారాల పూరణలో

# ప్రజలకు అండగా బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి.

**గడ్డి అన్నారం – జూలై 11 (మహప్రభ )**
ప్రత్యేక సమగ్ర ఓటరు సవరణ ఎస్ ఐ ఆర్ కార్యక్రమంలో భాగంగా గడ్డిఅన్నారం డివిజన్ పరిధిలోని శ్రీనగర్ కాలనీలో ఓటరు ఫారాల పూరణలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలకు బీజేపీ నాయకులు, మాజీ కార్పొరేటర్ బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి అండగా నిలిచారు. శ్రీనగర్ కాలనీకి చెందిన వెంకటయ్య మరియు వారి కుటుంబ సభ్యులకు సంబంధించిన ఓటరు వివరాల ఫారాలు అందినప్పటికీ, వాటిని ఎలా సక్రమంగా పూరించాలో తెలియక ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో వారు బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి ని సంప్రదించారు. దీనికి వెంటనే స్పందించిన ఆయన స్వయంగా వెంకటయ్య నివాసానికి వెళ్లి, కుటుంబ సభ్యుల ఓటరు వివరాలను పరిశీలించి ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా ఫారాలను సక్రమంగా పూరించి అందించారు. ఈ సందర్భంగా బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రస్తుతం ఎస్ ఐ ఆర్ కార్యక్రమంలో భాగంగా ఫారాల సమర్పణకు గడువు



తక్కువగా ఉండటంతో చాలామంది ప్రజలు తొందరపాటుతో ఫారాలను పూరిస్తూ పొరపాట్లు చేస్తున్నారని అన్నారు. అలాంటి తప్పిదాలు భవిష్యత్తులో ఇబ్బందులకు దారితీయకుండా ఉండేందుకు ప్రతి ఒక్కరూ సంబంధిత బి ఎల్ ఓ లను లేదా వివిధ రాజకీయ పార్టీలకు చెందిన బి ఎల్ ఏ ల సహాయం తీసుకుని ఫారాలను సక్రమంగా పూరించాలని సూచించారు. ఓటరు ఫారాల పూరణలో ఎవరికైనా సందేహాలు లేదా సహాయం అవసరమైతే ఎలాంటి సంకోచం లేకుండా తన వ్యక్తిగత వాట్సాప్ లేదా ఫోన్ నంబర్ ద్వారా సంప్రదించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రజలకు అవసరమైన సేవలను ఎల్లప్పుడూ అందించేందుకు తాను సిద్ధంగా ఉంటానని బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీజేపీ నాయకులు, బూత్ స్థాయి కార్యకర్తలు, కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

## ప్రత్యేక సమగ్ర ఓటరు సవరణ కార్యక్రమాన్ని పరిశీలించిన మాజీ కార్పొరేటర్ నాయకోటి పవన్ కుమార్





**కొత్తపేట జూలై 11( మహప్రభ )**
కొత్తపేట డివిజన్ వార్డ్ కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రత్యేక సమగ్ర ఓటరు సవరణ ఎస్ ఐ ఆర్ కార్యక్రమాన్ని కొత్తపేట డివిజన్ మాజీ కార్పొరేటర్ నాయకోటి పవన్ కుమార్ ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా వార్డ్ కార్యాలయంలో కొనసాగుతున్న ఎస్.ఐ.ఆర్ కార్యక్రమంపై సంబంధిత అధికారులను అడిగి పూర్తి వివరాలను తెలుసుకున్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, పారదర్శకంగా, వేగవంతంగా సేవలు అందించేలా ప్రక్రియను నిర్వహించాలని అధికారులకు సూచించారు. ప్రతి అర్హుడైన ఓటరుకు సకాలంలో సేవలు అందేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. అనంతరం వార్డ్ కార్యాలయానికి వచ్చిన ప్రజలతో మాట్లాడిన నాయకోటి పవన్ కుమార్ , ఓటరు జాబితాలో ప్రతి అర్హుడి పేరు నమోదు కావడం, వివరాలను సరిచేసుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత బలోపేతం చేయడంలో ప్రత్యేక సమగ్ర ఓటరు సవరణ కార్యక్రమం కీలకమైనదని, ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఓటరు జాబితాలో పేరు నమోదు, మార్పులు, చేర్పులు, తొలగింపులు వంటి అంశాలను నిర్లక్ష్యం చేయకుండా సంబంధిత అధికారులను సంప్రదించి నిర్ణీత గడువులోగా తమ వివరాలను సరిచేసుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రతి అర్హుడికి ఓటు హక్కు కల్పించే లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమంలో ప్రజలందరూ చురుకుగా పాల్గొని విజయవంతం చేయాలని నాయకోటి పవన్ కుమార్ పిలుపునిచ్చారు.

## వినాయక చవితి నాటికి సరూర్‌నగర్ మినీ ట్యాంక్‌బండ్‌లో గణేష్ నిమజ్జన ఏర్పాట్లు పూర్తి చేయాలి

**-అధికారులకు టీపీసీసీ అధికార ప్రతినిధి దారిపల్లి రాజశేఖర్ రెడ్డి ఆదేశం**







**సరూర్ నగర్ – జూలై 11 (మహాప్రభ )**
గడ్డి అన్నారం డివిజన్ సరూర్ నాగర్‌లోని రానున్న వినాయక చవితి పండుగను ముందస్తు సరూర్‌నగర్ మినీ ట్యాంక్‌బండ్‌లో గణేష్ నిమజ్జన ఏర్పాట్లను వేగవంతం చేయాలని టీపీసీసీ అధికార ప్రతినిధి దారిపల్లి రాజశేఖర్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ఇరిగేషన్ శాఖ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో జరుగుతున్న పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా గణేష్ నిమజ్జనం కోసం ఏర్పాటు చేస్తున్న ప్రత్యేక వ్యూ పాయింట్ నిర్మాణ పనులను ప్రారంభించారు. పైలింగ్ మెషిన్‌తో పిల్లర్ల నిర్మాణ పనులు ప్రారంభమైన నేపథ్యంలో, పనుల నాణ్యతతో పాటు నిర్ణీత గడువులోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. వినాయక చవితి నాటికి అన్ని అభివృద్ధి పనులను పూర్తిచేసి భక్తులకు అందుబాటులో ఉంచాలని, నిమజ్జనానికి వచ్చే వేలాది మంది భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన మౌలిక వసతులు, భద్రతా చర్యలు, సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తూ అన్ని శాఖల సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఇరిగేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మల్లేష్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వీరారెడ్డి, అసిస్టెంట్ ఇంజనీర్ రాఘవేందర్ తదితర అధికారులతో కలిసి జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించి, పనుల పురోగతిపై వివరాలు తెలుసుకున్నారు.

## బోనాల పండుగ అభివృద్ధి నిధుల కోసం వెంటనే దరఖాస్తులు సమర్పించాలి

**దేవాలయ కమిటీలకు ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి సూచన**

**ఎల్‌బినగర్ – జూలై 11 (మహాప్రభ )**
రానున్న బోనాల పండుగ సందర్భంగా దేవాదాయ శాఖ ద్వారా దేవాలయాల అభివృద్ధి నిధులు బోనాల చెక్కులు మంజూరు చేయనున్న నేపథ్యంలో ఎల్.బి.నగర్ నియోజకవర్గ పరిధిలోని అన్ని దేవాలయాల అధ్యక్షులు, కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు అవసరమైన పత్రాలతో వెంటనే దరఖాస్తులు సమర్పించాలని ఎల్ బి నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి కోరారు. దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు అందిస్తున్నందున అర్హత కలిగిన ప్రతి దేవాలయం ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. దరఖాస్తుతో పాటు దేవాలయం లెటర్‌ప్యాడ్‌పై అసిస్టెంట్ కమిషనర్, దేవాదాయ శాఖ, రంగారెడ్డి జిల్లా వారికి ఉద్దేశించి వినతిపత్రం, గత సంవత్సరం



మంజూరైన నిధుల వివరాలు మరియు ఈ సంవత్సరం అవసరమైన నిధుల వివరాలు, బ్యాంక్ పాస్‌బుక్ మొదటి, రెండో పేజీలతో పాటు గత సంవత్సరం నిధుల నమోదు ఉన్న పేజీల ప్రతులు, అధ్యక్షులు మరియు కార్యదర్శి ఆధార్ కార్డుల ప్రతులు, దేవాలయం, అమ్మవారి ఫోటోలు, ఐదు రెవెన్యూ స్టాంపులను మూడు కలర్ జిరాక్స్ ప్రతులతో సమర్పించాలని తెలిపారు. అన్ని పత్రాలను పూర్తి స్థాయిలో సిద్ధం చేసి ఎల్ బి నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో వీలైనంత త్వరగా అందజేయాలని కోరారు. అవసరమైన పత్రాలను సకాలంలో సమర్పించడం ద్వారా దేవాదాయ శాఖ నుంచి అభివృద్ధి నిధులు త్వరితగతిన మంజూరయ్యే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఎల్ బి నగర్ నియోజకవర్గంలోని అన్ని దేవాలయాల కమిటీలు ఈ విషయాన్ని గమనించి, ఎలాంటి జాప్యం లేకుండా దరఖాస్తులను సమర్పించి ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి విజ్ఞప్తి

## మృతుల కుటుంబాలకు బీఆర్ఎస్ మాజీ జెడ్పీటీసీ సైదులు గౌడ్ ఆర్థిక సాయం

**తిప్పర్తి, జూలై 11( మహాప్రభ)**
తిప్పర్తి మండల కేంద్రానికి చెందిన తండు లింగస్వామి, కంకణాలపల్లి గ్రామానికి చెందిన సూరారపు రాజేందర్ అనారోగ్యంతో మృతి చెందగా, వారి కుటుంబాలను బీఆర్ఎస్ పార్టీ నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా తిప్పర్తి మాజీ జెడ్పీటీసీ తండు సైదులు గౌడ్ బీఆర్ఎస్ పార్టీ తరఫున మృతుల కుటుంబాలకు రూ.10 వేల చొప్పున ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కుటుంబ పెద్దను



కోల్పోయిన బాధలో ఉన్న కుటుంబాలకు పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో బాధిత కుటుంబాలకు తోడుగా నిలవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కందుల లక్ష్మయ్య, వనపర్తి నాగేశ్వరరావు, గుండు వెంకన్న, దోమలపల్లి రామలింగయ్య, దోమలపల్లి కృష్ణయ్య, ముత్తినేని జానకిరాములు తదితరులు పాల్గొన్నారు.

# రెడ్డి కార్పొరేషన్‌కు తక్షణమే పాలకవర్గాన్ని నియమించాలి





**-సదాశివనగర్‌లో రెడ్డి ఐక్యవేదిక నూతన మండల కమిటీ ఏకగ్రీవ ఎన్నిక**

**-పేద రెడ్డి కుటుంబాలకు సంక్షేమ పథకాలు, రుణాలు,అందించాలి,నిధులు విడుదల చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేస్తామని హెచ్చరిక**

**-రెడ్డి సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు నాగర్తి చంద్రారెడ్డి**



**కామారెడ్డి జూలై 11 (మహాప్రభ)**
తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన 16 కార్పొరేషన్లలో రెడ్డి కార్పొరేషన్‌ను చేర్చడం స్వాగతించదగ్గ నిర్ణయమే అయినప్పటికీ, ఇప్పటి వరకు కార్పొరేషన్‌కు చైర్మన్, పాలకవర్గాన్ని నియమించకపోవడం సమంజసం కాదని రాష్ట్ర రెడ్డి ఐక్యవేదిక అధ్యక్షుడు నాగర్తి చంద్రారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.
శనివారం కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండల కేంద్రంలోని రెడ్డి సంఘ భవనంలో రాష్ట్ర అధ్యక్షులు నాగర్తి చంద్రారెడ్డి, జిల్లా కమిటీ పెద్దల ఆధ్వర్యంలో రెడ్డి ఐక్యవేదిక నూతన మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం సంఘ సభ్యులు రాష్ట్ర అధ్యక్షులు జిల్లా కమిటీ సభ్యులకు శాలువాతో ఘనంగా సన్మానించారు అనంతరం నూతనంగా ఎన్నుకున్న సదాశివ నగర్ నూతన పాలకవర్గాన్ని సదాశివ నగర్ రెడ్డి సంఘ సభ్యులు, శాలువాతో ఘనంగా సన్మానించారు , అనంతరం రాష్ట్ర రెడ్డి సంఘ అధ్యక్షులు నాగర్తి చంద్రారెడ్డి మాట్లాడుతూ, కార్పొరేషన్ ద్వారా ఆర్థికంగా వెనుకబడిన రెడ్డి కుటుంబాలకు సంక్షేమ పథకాలు సమర్థవంతంగా అమలు చేయాలని కోరారు. విద్య, వైద్యం, ఉపాధి, స్వయం ఉపాధి కోసం అవసరమైన రుణాలను కార్పొరేషన్ ద్వారా అందించాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. అనంతరం రెడ్డి సంఘాల జిల్లా అడక్ కమిటీ అధ్యక్షుడు జుక్కంటి మోహన్‌రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రంలో ఆర్థికంగా వెనుకబడిన రెడ్డి కుటుంబాలు అధిక సంఖ్యలో ఉన్నాయని తెలిపారు. ఈడబ్ల్యూఎస్ (జుబొ) రిజర్వేషన్‌ను పేద రెడ్డి యువత ప్రభుత్వ ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు, బ్యాంకు రుణాల కోసం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రెడ్డి అంటే కేవలం వ్యాపారి కాదని, కష్టపడి శ్రమించే రైతు అనీ విషయాన్ని ప్రభుత్వాలు గుర్తించాలని అన్నారు. రెడ్డి కార్పొరేషన్‌కు వెంటనే చైర్మన్, పాలకవర్గాన్ని నియమించి నిధులను, విడుదల చేయాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా, రెడ్డి సంఘాల ఆధ్వర్యంలో ధర్నాలు, నిరసనలు చేపట్టి హక్కుల కోసం ఉద్యమిస్తామని హెచ్చరించారు. రాష్ట్ర అధికార ప్రతినిధి కే. రాజ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ, ప్రతి గ్రామంలో రెడ్డి సంఘాలు ఐక్యంగా పనిచేస్తూ సంఘాన్ని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. రాజకీయాలకు అతీతంగా పేద రెడ్డి కుటుంబాల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. నూతనంగా ఏకగ్రీవంగా ఎన్నికైన సదాశివనగర్ మండల అధ్యక్షుడు డాక్టర్ ఎర్రవట్టి లింగారెడ్డి మాట్లాడుతూ, తనపై విశ్వాసం ఉంచి 13 గ్రామాల రెడ్డి సంఘాల పెద్దలు మండల అధ్యక్షుడిగా ఎన్నుకోవడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. గ్రామాల రెడ్డి సంఘాల కలుపుకొని మండలంలోని రెడ్డి సంఘాన్ని బలోపేతం చేస్తానాని తెలియజేశారు
ఈ కార్యక్రమంలో ,రాష్ట్ర అధికార ప్రతినిధి రాజ్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి ,మోతే రాంరెడ్డి, జిల్లా అడక్ కమిటీ కన్వీనర్ జుక్కంటి మోహన్‌రెడ్డి, జిల్లా వర్కింగ్ కన్వీనర్ ,బాణాల, మల్లారెడ్డి, జిల్లా ప్రధాన, కార్యదర్శి, బొక్క ,ప్రతాప్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి ,అంజిరెడ్డి, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ ,కందడి, ప్రవీణ్‌రెడ్డి, సదాశివ నగర్ మండల అధ్యక్షులు, ఎర్రవటి, లింగారెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి, బాణాల ,వెంకటరెడ్డి, ఉపాధ్యక్షులు, బద్దం, రాజిరెడ్డి, ఏనుగు, జైపాల్‌రెడ్డి, కార్యదర్శి, ఆకిటి, మహేందర్‌రెడ్డి, కోశాధికారి, మర్కంటి, జగన్‌రెడ్డి, ఆలకొండ, శ్రీనివాస్‌రెడ్డి, ఏలేటి ,సంజీవరెడ్డి, సదాశివనగర్ గ్రామ రెడ్డి సంఘం అధ్యక్షుడు లింగారెడ్డి, రెడ్డి సంఘాల కమిటీ సభ్యులు, సంఘ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ ఎల్లమ్మ తల్లి ఆలయాన్ని దర్శించుకున్న బిఆర్ఎస్ పార్టీ దేవరకొండ నియోజకవర్గ నాయకులు వద్య రమేష్.




**దేవరకొండ డివిజన్ జూలై 11 ( మహాప్రభ )**
శనివారం డిండి మండలం ఖానా పూర్ గ్రామ పంచాయతీ పరిధిలో నూతనంగా నిర్మించిన శ్రీ ఎల్లమ్మ తల్లి ఆలయాన్ని దర్శించుకొని ప్రత్యేక పూజ కార్యక్రమం నిర్వహించిన బి.ఆర్.ఎస్ పార్టీ దేవరకొండ నియోజకవర్గ నాయకులు వద్య రమేష్ ఇచ్చిన మాట ప్రకారం గుడి నిర్మాణాన్ని సహకరించి నిర్మాణం పూర్తి అయిన తర్వాత ఖానాపూర్ గ్రామ పంచాయతీ ప్రజల ఆహ్వానం మేరకు గుడినీ దర్శించుకున్నారు. అనంతరం వారిని శాలువాతో సత్కరించారు. ఈ ఖానాపూర్ బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు బొడ్డుపల్లి జయంత్, శ్రీ తుమ్మల శ్రీనివాస్ రెడ్డి, అలుగు బెల్లి సత్తి రెడ్డి, భాష ,లోకసాని సాయి, శ్రీను, సైదులు ,దాసు, వెంకటయ్య, శ్రీను ,లక్ష్మయ, నరసింహ, శ్రీను ,సైదులు , పెద్ద తండా మాజీ సర్పంచ్ కాట్రావత్ వెంకటేష్, బాలాజీ నాయక్, ఉప సర్పంచ్ విజయ్, తదితరులు పాల్గొనారు.

## లక్షల క్యూసెక్కుల గోదావరి వరద నీరు సముద్రంలో కలుస్తోంది

**-నీటి వినియోగంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ ఎమ్మెల్యే రవీంద్ర కుమార్ విమర్శ**



**దేవరకొండ జూలై 11( మహా ప్రభ)**
రాష్ట్రంలో లక్షల క్యూసెక్కుల గోదావరి వరద జలాలు సముద్రంలో కలుస్తున్నా, వాటిని వినియోగించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ విమర్శించారు. పక్క రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ పట్టిసీమ మోటార్ల ద్వారా గోదావరి జలాలను వినియోగించుకుంటుంటే, తెలంగాణ ప్రభుత్వం మాత్రం చోద్యం చూస్తోందని ఆయన అన్నారు. కన్నెపల్లి మోటార్లను ప్రారంభించి తెలంగాణ అవసరాలకు నీటిని మళ్లించే అవకాశం ఉన్నప్పటికీ, ప్రభుత్వం ఆ దిశగా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. కేవలం రాజకీయ కక్షతోనే నిర్ణయాలు తీసుకుంటూ, సొంత రాష్ట్ర రైతుల ప్రయోజనాలను విస్మరిస్తున్నారని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వైఖరి కారణంగా తెలంగాణ రైతులు నష్టపోతున్నారని రవీంద్ర కుమార్ విమర్శించారు. తెలంగాణకు చెందిన నీటిని సమర్థంగా వినియోగించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని, దీంతో రాష్ట్ర రైతాంగం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోందని ఆయన పేర్కొన్నారు. వెంటనే కన్నెపల్లి మోటార్లను ప్రారంభించి గోదావరి జలాలను తెలంగాణ సాగు అవసరాలకు వినియోగించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## చేనేత సహకార సంఘం నూతన కమిటీ సభ్యులకు ఎమ్మెల్యేకు ఘన సన్మానం



**దేవరకొండ జూలై 11( మహాప్రభ )**
దేవరకొండ నూతనంగా ఎన్నికైన చేనేత సహకార సంఘం నూతన కమిటీ సభ్యులు మున్సిపల్ చైర్ పర్సన్ పున్న శైలజ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా దేవరకొండ శాసనసభ్యులు నేనావత్ బాలునాయక్ ని మరియు శ్రీశైలం బోర్డు డైరెక్టర్ చిలువేరు కాశీనాథ్ ని కలిసి సన్మానించడం జరిగింది ఇట్టి కార్యక్రమంలోఅధ్యక్షులు బాలరాజు ఉపాధ్యక్షుడు స్వామి నందీశ్వర్ ప్రధాన కార్యదర్శి పున్న గోవర్ధన్ కోశాధికారి వనంశ్రీనివాసులు డైరెక్టర్లు గుర్రం జయలక్ష్మి పగిడిమర్రి శ్రీనివాసులు మరియు పగిడిమర్రి రఘురాములు . చిట్టిపోలు శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు

## రామాయంపేటలో ఆహార భద్రతా నిబంధనల ఉల్లంఘన

**-2 ఫాస్ట్ ఫుడ్/టిఫిన్ సెంటర్లకు 10,000 చొప్పున జరిమానా**




**రామాయంపేట, జూలై 11(మహాప్రభ)**
వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో ప్రజలు అనారోగ్యం బారిన పడకుండా ముందస్తు చర్యల్లో భాగంగా మున్సిపల్ కమిషనర్ ఎ. రవీందర్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఆహార సంస్థలపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో నిబంధనలు ఉల్లంఘించిన రెండు ఆహార సంస్థలకు 10,000 చొప్పున పెనాల్టీ విధించారు.

**జరిమానాకు కారణాలు:**

1. పరిశుభ్రత లేమి
2. కాలం చెల్లిన ఆహార పదార్థాల వినియోగం
3. ఫుడ్ లైసెన్స్ నిబంధనలు పాటించకపోవడం

**కమిషనర్ హెచ్చరిక:**
ఈ సందర్భంగా కమిషనర్ ఎ. రవీందర్ మాట్లాడుతూ వర్షాకాలంలో ఫుడ్ పాయిజన్, టైఫాయిడ్, డయేరియా వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. కాబట్టి పట్టణంలోని అన్ని హోటళ్లు, టిఫిన్ సెంటర్లు పరిశుభ్రత పాటించాలని సూచించారు. నిబంధనలు రాజీ పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. "ప్రజలు కూడా బయట పరిశుభ్రత లేని ఆహారం తినవద్దు" అని సూచించారు. ఇలాంటి తనిఖీలు ముమ్ముందు కూడా కొనసాగుతాయని పేర్కొన్నారు.

## ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడి జన్మదిన వేడుకలు




**మెదక్ జిల్లా -11జూలై (మహాప్రభ ).**
మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ రథసారథి జిల్లా అధ్యక్షులు శివన్న గారి ఆంజనేయులు గౌడ్ జన్మదినం సందర్భంగా ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులో జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మెదక్ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మందు గుల. గంగాధర్, పాపన్నపేట మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు లింగంపేట నరేంద్ర గౌడ్, హవేలీ ఘన్పూర్ మండల పార్టీ అధ్యక్షులు గుండారం కిరణ్ గౌడ్, మెదక్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు. మార్గం నాగరాజు , శంకరంపేట మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు హలవత్ మోహన్ నాయక్,మెదక్ మండల సీనియర్ నాయకులు రమేష్, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు పరశురాం గౌడ్, మాజీ ఉపసర్పంచ్ కలీముద్దీన్ , ముశెట్టి కిష్టయ్య ప్రవీణ్ గౌడ్, షేక్ అక్బర్ మొయూద్దీన్, మహేష్, మెదక్ మండలం సర్పంచ్ ఫోరంల అధ్యక్షుడు యాదగిరి తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## మాజీ మంత్రి హరీష్ రావు కి మట్టి వాటర్ ఫిల్టర్‌ను అందజేసిన కళాకారుడు చెలిమిళ్ల భానుచందర్ ప్రజాపతి.



**సరూర్ నగర్ - జూలై 11 (మహాప్రభ )**
మాజీ మంత్రి, సిద్ధిపేట డైనమిక్ నాయకుడు హరీష్ ని మర్యాదపూర్వకంగా కలిసి, స్వయంగా మట్టితో తయారు చేసిన వాటర్ ఫిల్టర్‌ను ప్రముఖ కళాకారుడు చెలిమిళ్ల భానుచందర్ ప్రజాపతి అందజేశారు. ఈ సందర్భంగా భానుచందర్ ప్రజాపతి మాట్లాడుతూ, సంప్రదాయ మట్టి పాత్రల వినియోగం ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని అన్నారు. ప్లాస్టిక్ వస్తువుల వినియోగాన్ని తగ్గించి, మట్టి పాత్రల్లో వంట చేయడం, నీటిని నిల్వ చేసి తాగడం ద్వారా విషరహితమైన, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవచ్చని తెలిపారు. ప్రస్తుతం పెరుగుతున్న ప్లాస్టిక్ కాలుష్యాన్ని అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ మట్టి పాత్రల వినియోగాన్ని ప్రోత్సహించాలని ఆయన కోరారు. మన పూర్వీకుల సంప్రదాయాన్ని కాపాడుతూ, పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలని పిలుపునిచ్చారు. ప్లాస్టిక్‌కు నో చెప్పుదాం ఆరోగ్యానికి ఎస్ చెప్పుదాం మట్టి పాత్రలను ఆదరిద్దాం మన సంప్రదాయాన్ని గౌరవిద్దాం అని ఆయన అన్నారు. ఈ సందర్భంగా మట్టి కళాకారులను ప్రోత్సహిస్తూ, సంప్రదాయ వృత్తులకు చేయూత అందించాలని భానుచందర్ ప్రజాపతి విజ్ఞప్తి చేశారు

## శివాజీ యువదళ్ ఆధ్వర్యంలో విద్యార్థికి ఆర్థిక సహాయం ..



**దేవరకొండ జూలై 11( మహాప్రభ)**
శివాజి యువదళ్ దేవరకొండ పట్టణ అధ్యక్షుడు పగిడిమర్రి సతీష్ పిఎస్ వి ఎడ్యుకేషన్ ఒ చారిటబుల్ ఫౌండేషన్ తరుపున ఆర్థిక సాయాన్ని ఇద్దంపల్లి గ్రామానికి చెందిన ఏపూరి సన్నీ తండ్రి ఏపూరి పురుషోత్తం వారికి అనారోగ్య సమస్యలు ఉన్న చదువు పై ఆసక్తితో బీటెక్ ప్రథమ సం"లో మంచి ర్యాంక్ సాధించారు ద్వితీయ సంవత్సారానికి గాను ఆర్థిక ఇబ్బంది వల్ల కాలేజీ ఫీస్ కట్టలేక బాధపడుతున్న వారుశివాజీ యువదళ్ ను సంప్రదించడం జరిగింది. వారికి మా ఫౌండేషన్ తరుపున 5000 రూ ఆర్థిక సాయాన్ని అందించారు ఆ నిరుపేద కుటుంబానికి అన్ని విధాలుగా శివాజి యువదళ్ సహాయ సహకారాలు అందిస్తామని భరోసానిచ్చారు కార్యక్రమంలో శివాజి యువదళ్ వ్యవస్థాపకులు హరికృష్ణ ముష్టిపల్లి నగర గౌ అధ్యక్షుడు నేతల వెంకటేష్ యువదళ్ కార్యనిర్వాహణ అధ్యక్షుడు ఐతరాజు శ్యామ్, ప్రధాన కార్యదర్శి ఇరగదిండ్ల శ్రీనివాస్ ఉపాధ్యక్షులు దుర్యోధన పాటిల్, గుర్రం శ్రీనివాస్, చిలువేరు సత్యం, గాజుల వినయ్ దేవరకొండ మధు, జాడే సాయి, అటకేశ్వరం జగన్ మరియు తదితరులు పాల్గొన్నారు .

## లక్ష్మాపూర్‌లో 'SIR' ప్రక్రియను జాగ్రత్తగా పరిశీలించిన మెదక్ ఆర్డీవో

**ఓటర్ల జాబితా సవరణపై అధికారులకు సూచనలు**



**రామాయంపేట, జులై 11(మహాప్రభ)**
రామాయంపేట మండలం లక్ష్మాపూర్ గ్రామంలో ఎస్ఐఆర్ – Special Intensive Revision ప్రక్రియను మెదక్ ఆర్డీవో రమాదేవి పరిశీలించారు.
ఈ సందర్భంగా ఆమె ఓటర్ల జాబితా సవరణ పనులను క్షేత్ర స్థాయిలో తనిఖీ చేసి, అధికారులకు అవసరమైన సూచనలు చేశారు. జాబితాలో పేర్లు చేర్పు, తొలగింపు, దిద్దుబాట్ల ప్రక్రియ సక్రమంగా జరగాలని ఆదేశించారు.

**కార్యక్రమంలో పాల్గొన్నవారు:**
ఈ కార్యక్రమంలో రామాయంపేట తహసీల్దార్ రజనీకుమారి, రెవెన్యూ ఇన్స్పెక్టర్ గోపి, గ్రామ సర్పంచ్ గొల్లపల్లి నవీన్ గౌడ్, పీఎల్వోలు, రెవెన్యూ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు. ఓటరు జాబితా పారదర్శకంగా, ఎటువంటి పొరపాట్లు లేకుండా తయారు చేయాలని ఆర్డీవో అధికారులకు స్పష్టం చేశారు.

# బిజినెస్

## బంగారం ధరల్లో స్వల్ప మార్పు.. తగ్గిన పసిడి ధరలు



**హైదరాబాద్,**
బంగారం కొనుగోలు చేయాలని భావిస్తున్న వారికి స్వల్ప ఊరట లభించింది. శనివారం దేశీయ మార్కెట్లో బంగారం ధరల్లో స్వల్ప తగ్గుదల నమోదైంది. అంతర్జాతీయ మార్కెట్ పరిణామాలు, డాలర్ విలువలో మార్పులు, పెట్టుబడిదారుల కొనుగోలు ధోరణులు పసిడి ధరలపై ప్రభావం చూపుతున్నాయి. హైదరాబాద్ మార్కెట్‌లో శనివారం 22 క్యారెట్ల బంగారం 10 గ్రాములకు సుమారు రూ.1,33,000గా ఉండగా, 24 క్యారెట్ల బంగారం 10 గ్రాములకు సుమారు రూ.1,39,650గా నమోదైంది. నిన్నటితో పోలిస్తే ధరల్లో స్వల్ప తగ్గుదల కనిపించింది. దేశవ్యాప్తంగా బంగారం ధరలు నగరం, పన్నులు, స్థానిక మార్కెట్ పరిస్థితుల ఆధారంగా కొంత మారవచ్చు. ప్రస్తుతం బంగారం ధరల కదలికలను పెట్టుబడిదారులు, ఆభరణాల కొనుగోలుదారులు ఆసక్తిగా గమనిస్తున్నారు. బంగారం కొనుగోలు చేసే వారు ధరలతో పాటు బంగారం స్వచ్ఛత, హాల్‌మార్క్ వివరాలను పరిశీలించి కొనుగోలు చేయాలని నిపుణులు సూచిస్తున్నారు.

## సిబిల్ స్కోర్ లేకున్నా క్రెడిట్ కార్డు పొందొచ్చు.. ఎలాగంటే?




దేశంలో క్రెడిట్ కార్డుల వాడకం పెరుగుతోంది. సిబిల్ స్కోర్ తక్కువగా ఉన్నవారు కూడా ఫిక్స్డ్ డిపాజిట్ చేసి సెక్యూర్డ్ క్రెడిట్ కార్డులను పొందవచ్చు. ఈ కార్డులు క్రెడిట్ స్కోర్, ఆదాయం వంటి వాటిని పరిగణనలోకి తీసుకోవు. ఫిక్స్డ్ డిపాజిట్ మొత్తానికి సమానమైన క్రెడిట్ పరిమితితో పాటు, మెరుగైన క్రెడిట్ చరిత్రను నిర్మించుకోవడానికి ఇవి సహాయపడతాయి. లావాదేవీల వివరాలు క్రెడిట్ బ్యూరోలకు చేరడంతో స్కోర్ పెరుగుతుంది. సెక్యూర్డ్ క్రెడిట్ కార్డులను తెలివిగా వాడితే అన్‌సెక్యూర్డ్ కార్డులకు అప్‌గ్రేడ్ అయ్యే అవకాశాలున్నాయి. ఈ కార్డుల ద్వారా ఖర్చులు కూడా అదుపులో ఉంటాయి.

## టాటా మోటార్స్ కొత్త స్టెల్త్ ఎడిషన్ హారియర్, సఫారీ విడుదల




8టాటా మోటార్స్ భారతదేశంలో 2026 హారియర్, సఫారీ స్టెల్త్ ఎడిషన్‌లను విడుదల చేసింది. ఈ కొత్త ఎడిషన్లు టాప్ స్పెక్ ఫియర్‌లెస్ అల్ట్రా, అకంప్లిష్డ్ అల్ట్రా ట్రిమ్‌ల ఆధారంగా రూపొందించబడ్డాయి. వీటిలో స్టెల్త్ బ్లాక్ ఎక్స్‌టీరియర్ పెయింట్ స్కీమ్, మ్యాట్ స్టెల్త్ బ్లాక్ ఫినిషింగ్‌తో కూడిన 19-అంగుళాల అల్లాయ్ వీల్స్, ఫ్రంట్ ఫెండర్లపై 'స్టీల్త్' బ్యాడ్జ్ వంటి కాస్మెటిక్ అప్‌డేట్‌లు ఉన్నాయి. హారియర్ స్టెల్త్ ఎడిషన్ ధర రూ.23.43 లక్షల నుంచి రూ.26.01 లక్షల మధ్య, సఫారీ స్టెల్త్ ఎడిషన్ ధర రూ.24.09 లక్షల నుంచి రూ.26.76 లక్షల మధ్య ఉన్నాయి.

## గ్లోబల్ రికార్డ్: ప్రపంచంలోనే 4వ స్థానంలో 'ఎయిర్ ఇండియా'!

సిరియం సంస్థ జూన్ 2026 నివేదిక ప్రకారం.. ఎయిర్ ఇండియా ప్రపంచంలోనే అత్యుత్తమ సమయపాలన పాటించే విమానయాన సంస్థల్లో 4వ స్థానాన్ని సాధించింది. మొత్తం 15,135 విమానాలలో 86.85% సమయానికి చేరుకోగా, 86.23% సమయానికి బయలుదేరాయి. 99.7% విమానాలు రద్దు కాకుండా నడిచాయి. ఢిల్లీ, ముంబై కేంద్రాలుగా టర్న్‌రౌండ్ ప్రక్రియను క్రమబద్ధీకరించడం, నిరంతర పర్యవేక్షణ ద్వారా ఈ ఘనత సాధించారు. వాతావరణ, సాంకేతిక సమస్యలను అధిగమిస్తూ మెరుగైన సేవలు అందించేందుకు సంస్థ కృషికి ఈ గుర్తింపు నిదర్శనం.




## 100 మీటర్లు 10.14 సెకన్లలో.. తొలి భారతీయుడిగా అనిమేశ్ రికార్డు..!

భారత ట్రాక్ అండ్ ఫీల్డ్‌లో ఆశాకిరణంగా అవతరించిన అనిమేశ్ కుజుర్ మరోసారి వార్తల్లో నిలిచాడు. ఇండియన్ ఉసేన్ బోల్ట్‌గా పేరొందిన ఈ కుర్రాడు విదేశీ గడ్డపై 10.14 సెకన్లలోనే 100 మీటర్ల పరుగును పూర్తి చేశాడు. జర్మనీ వేదికగా జరిగిన పుమా ఫాస్ట్ ఆర్ట్బు లెగ్స్ 2026 మీట్ లో సత్తా చాటిన అనిమేశ్ భారత్ అవతల ఇంత వేగంతో వంద మీటర్లు పరుగెత్తిన తొలి అథ్లెట్‌గా రికార్డు నెలకొల్పాడు.ట్రాక్ మీద బుల్లెట్ వేగంతో దౌడు తీస్తూ జాతీయ స్థాయిలో రికార్డులు బద్దలు కొడుతున్న అనిమేశ్ కుజుర్ మళ్లీ మెరిశాడు. టోక్యోలో జరుగబోయే వరల్డ్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిక్స్ మీద గురి పెట్టిన అతడు పుమా పాస్ట్ ఆర్ట్బు లెగ్స్ 2006 మీట్‌లో చిరుతలా పరుగుతీశాడు. 10.14 సెకన్లలోనే 100 మీటర్ల పరుగును పూర్తి చేసి ఔరా అనిపించాడు. తొలుత 10.19 సెకన్లకు పరిమితమైన అనిమేశ్ ఫైనల్లో తన వేగాన్ని మరింత మెరుగుపరుచుకున్నాడు. అయితే.. అత్యంత వేగంగా 100 మీటర్ల పరుగుతో రికార్డు సాధించిన గురిందెర్వీర్ సింగ్(10.09 సెకన్లు)ను మాత్రం అందుకోలేకపోయాడీ రన్నర్.




100 మీటర్ల చిరుతలు
1. గురిందెర్వీర్ సింగ్ -- 10.09 సెకన్లు
2. అనిమేశ్ కుజుర్ -- 10.14 సెకన్లు
3. అనిమేశ్ కుజుర్ -- 10.15 సెకన్లు
4. గురిందెర్వీర్ సింగ్ -- 10.17 సెకన్లు
5. అనిమేశ్ కుజుర్ -- 10.18 సెకన్లు

**గురిందెర్వీర్‌కు పోటీగా..**

అనిమేశ్ కుజుర్‌ది ఛత్తీస్‌గఢ్‌లోని మారుమూల గ్రామం. ఆరడుగుల రెండు అంగుళాల పొడవుండే ఇతడు టీనేజ్ నుంచే తన స్పీడ్‌తో అందర్నీ ఆశ్చర్యపరుస్తున్నాడు. ఈమధ్యే 100 మీటర్ల దూరాన్ని 10.18 సెకన్లలో చేరుకొని చరిత్ర సృష్టించాడు. తద్వారా గురిందెర్వీర్ (10.20 సెకన్లు) పేరిట ఉన్న జాతీయ రికార్డును బద్దలు కొట్టి 'ది ఫాస్టెస్ట్ మ్యాన్ ఆఫ్ ఇండియా'గా అవతరించాడు అనిమేశ్. 22 ఏళ్లకే దేశం గర్వించదగ్గ అథ్లెట్‌గా మారిన అతడు ఈమధ్యే మొనాకో డైమండ్ లీగ్‌లో పోటీపడ్డాడు.అండర్ -23 విభాగంలో 200 మీటర్ల పరుగులో ఆస్ట్రేలియా స్టార్ గౌట్ గౌట్‌తో 'నువ్వానేనా' అన్నట్టు పరుగు తీసి ఔరా అనిపించాడు అనిమేశ్. అయితే.. సెకన్లో పదో వంతుతో పోడియం మీద నిల్చొనే అవకాశం కోల్పోయాడు. అయినా సరే.. అతడేమీ నిరాశకు లోనవ్వడం లేదు. 100 మీటర్లు, 200 మీటర్ల పరుగులో అంతర్జాతీయ వేదికలపై భారతీయ జెండాను రెపరెపలాడించేందుకు మరింత గట్టిగా ప్రయత్నించేందుకు సిద్ధమవుతున్నాడీ యంగ్ అథ్లెట్.

## చాహల్-ధనశ్రీ విడాకుల వెనుక అసలు నిజం..

### - వైరల్ అవుతున్న పాత ఇంటర్వ్యూ

భారత స్టార్ స్పిన్నర్ యుజ్వేంద్ర చాహల్, ధనశ్రీ వర్మల విడాకుల వ్యవహారం సోషల్ మీడియాలో మరోసారి హాట్ టాపిక్‌గా మారింది. వీరిద్దరూ మార్చి 2025లో అధికారికంగా విడాకులు తీసుకుని విడిపోయిన సంగతి తెలిసిందే. డిసెంబర్ 2020లో ఎంతో గ్రాండ్‌గా పెళ్లి చేసుకున్న ఈ జంట, ఆ తర్వాత కొన్ని సంవత్సరాలకే విడిపోవడం అభిమానులను తీవ్రంగా నిరాశపరిచింది. అయితే వీరిద్దరి బంధం ఎందుకు ముగిసిందనే దానిపై ప్రస్తుతం ధనశ్రీ వర్మకు సంబంధించిన ఒక పాత ప్రకటన నెట్టింట విపరీతంగా వైరల్ అవుతోంది. అందులో ఆమె చాహల్‌పై చేసిన కొన్ని సంచలన వ్యాఖ్యలు ఇప్పుడు అందరినీ ఆశ్చర్యపరుస్తున్నాయి.నిజానికి ధనశ్రీ వర్మ గతంలో రైజ్ అండ్ ఫాల్ అనే ఒక పాపులర్ రియాలిటీ షోలో పార్టిసిపెంట్ గా ఉన్నప్పుడు తన వ్యక్తిగత జీవితం గురించి కొన్ని కీలక విషయాలను పంచుకుంది. చాహల్‌తో తన పెళ్లి ఎక్కువ కాలం నిలవదని తనకు



వివాహమైన మొదటి ఏడాదిలోనే అర్థమైపోయిందని ఆ షోలో ధనశ్రీ ఓపెన్ అయ్యింది. అంతేకాకుండా, పెళ్లయిన రెండో నెలలోనే తాను చాహల్‌ను ఏదో ఒక విషయంలో రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నానని ఆమె సంచలన ఆరోపణలు చేసింది. అప్పటి నుంచే వారిద్దరి మధ్య నమ్మకం దెబ్బతిందని, అదే తమ బంధం ముగిసిపోవడానికి పునాది అని ఆమె ఆ ఇంటర్వ్యూలో పేర్కొంది. ఆ పాత వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో మళ్లీ హల్ చల్ చేస్తోంది. ఈ స్టార్ కపుల్ మధ్య గొడవలు జరుగుతున్నాయనే వార్తలు ఇప్పటివి కావు. పెళ్లయిన కొన్నాళ్లకే వీరి మధ్య మనస్పర్థలు రావడం ప్రారంభమయ్యాయి. ముఖ్యంగా 2022 సంవత్సరంలో ధనశ్రీ వర్మ తన సోషల్ మీడియా ప్రొఫైల్స్ (ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్) నుంచి చాహల్ అనే సర్నేమ్‌ను తొలగించడంతో వీరిద్దరూ విడిపోతున్నారనే వార్తలు మొదటిసారి వెలుగులోకి వచ్చాయి. ఆ తర్వాత చాలా కాలం పాటు వీరిద్దరూ ఒకే ఇంట్లో ఉండకుండా విడివిడిగానే జీవించారు. చివరకు విడాకులు తీసుకోవడమే బెస్ట్ అని భావించి కోర్టును ఆశ్రయించగా.. 20 మార్చి 2025న బాంద్రా ఫ్యామిలీ కోర్టు వీరి విడాకుల పిటిషన్‌ను అధికారికంగా మంజూరు చేసింది. దీంతో వీరి నాలుగేళ్ల వైవాహిక బంధానికి చట్టబద్ధంగా ఎండ్ కార్డ్ పడింది.

# స్పోర్ట్స్

## వింబుల్డన్‌కు క్రికెట్ కళ.. రాయల్ బాక్స్‌లో గిల్, సచిన్..!



ఇంగ్లండ్ వేదికగా జరుగుతున్న వింబుల్డన్ టోర్నీకి క్రికెట్ కళొచ్చింది. టెన్నిస్ గ్రాండ్‌స్లామ్ గ్యాలరీలో సచిన్ టెండూల్కర్, వెస్టిండీస్ లెజెండ్ బ్రియాన్ లారా, భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ తళుక్కుమన్నారు. రాయల్ బాక్స్‌లో రాయల్ లుక్‌తో గిల్ ప్రత్యేక ఆకర్షణగా నిలవగా.. సతీమణి అంజలి సమేతంగా సచిన్ హాజరయ్యాడు. విరామంలో వీరితో టెన్నిస్ గ్రేట్ రోజర్ ఫెదరర్ కలవడంతో కెమెరా కళ్లన్నీ వీరివైపే తిరిగాయి.వన్డే సిరీస్‌కు ముందే ఇంగ్లండ్ చేరుకున్న భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ బిజీగా గడుపుతున్నాడు. పాప్ సింగర్లను కలిసి.. మెర్సిడెజ్ బెంజ్ గ్యారేజ్‌లో ఫార్ములా వన్ రేసర్ ఆంటినెల్లాతో కలిసి కారిడార్ క్రికెట్ ఆడిన గిల్ ఈసారి వింబుల్డన్‌లో మెరిశాడు. భారత దిగ్గజం సచిన్ టెండూల్కర్ సతీసమేతంగా మ్యాచ్ చూసేందుకు రాగా.. రాయల్ బాక్స్‌లో వారి పక్కనే కూర్చున్నాడు టీమిండియా కెప్టెన్. మ్యాచ్ చూసేందుకు వచ్చిన వెస్టిండీస్ వెటరన్ బ్రియాన్ లారా, టెన్నిస్ లెజెండ్ రోజర్ ఫెదరర్‌తో కాసేపు ముచ్చటించాడు గిల్. జకోవిచ్, సినర్ మధ్య జరిగిన సెమీఫైనల్ మ్యాచ్ వీక్షించారు వీరంతా.ల

**డబుల్స్ భాగస్వామిగా**


అనంతరం మీడియాతో మాట్లాడిన గిల్.. 'క్రికెట్ బదులు ఏ ఆటను ఎంచుకుంటారు?' అనే ప్రశ్నకు 'టెన్నిస్' అని బదులిచ్చాడు. అయితే.. తనకు డబుల్స్ భాగస్వామిగా కార్లోస్ అల్కరాజ్ ఉండాలని అతడు చెప్పాడు. అల్కరాస్ ఆటను ఎంతో ఆస్వాదిస్తాడని చెప్పిన భారత సారథి.. అతడితో ఆడడం ఎంతో సరదగా ఉంటుందని అన్నాడు. భారత్, ఇంగ్లండ్ మధ్య జూలై 14 నుంచి మూడు వన్డేల సిరీస్ మొదలవ్వనుంది. శ్రేయాస్ అయ్యర్ సారథ్యంలో పొట్టి సిరీస్ కోల్పోయిన టీమిండియాకు వన్డే సిరీస్ విజయం కట్టబెట్టాలని గిల్ పట్టుదలతో ఉన్నాడు.



హాట్ షోలో రెచ్చిపోయిన నిధి అగర్వాల్..

# జూలై 24న 'రామాయణ' ట్రైలర్!

## అద్భుత దృశ్యకావ్యానికి ముహూర్తం ఫిక్స్..



ఇండియన్ సినిమా హిస్టరీలోనే మోస్ట్ అవేటెడ్ మూవీగా నిలుస్తున్న 'రామాయణ' సినిమా నుంచి ఒక క్రేజీ అప్‌డేట్ వచ్చింది. నితేష్ తివారీ దర్శకత్వంలో రణబీర్ కపూర్ (రాముడు), సాయి పల్లవి (సీత), రాకింగ్ స్టార్ యష్ (రావణాసురుడు) ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ పౌరాణిక చిత్రం యొక్క అఫీషియల్ ట్రైలర్ రిలీజ్ డేట్‌ను మేకర్స్ అనౌన్స్ చేశారు.జూలై 24న ఈ మూవీ ట్రైలర్‌ను ప్రపంచవ్యాప్తంగా చాలా గ్రాండ్‌గా రిలీజ్ చేయబోతున్నట్లు సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు. వేలాది సంవత్సరాలుగా భారతదేశ సంస్కృతికి, సనాతన ధర్మానికి ప్రతీకగా నిలిచిన రామాయణాన్ని ఈ తరం ఆడియన్స్‌కు నచ్చేలా సరికొత్తగా చూపించబోతున్నారు. హాలీవుడ్ రేంజ్ విజువల్ ఎఫెక్ట్స్, భారీ నిర్మాణ విలువలతో నమిత్ మల్హోత్రా ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌ను నిర్మిస్తున్నారు. కంప్లీట్ ఇండియన్ సినిమా హిస్టరీలోనే ముందెన్నడూ చూడని విధంగా, ఊహించని రేంజ్ బడ్జెట్‌తో ఈ సినిమా రెడీ అవుతోంది. దేశం గర్వించే ఈ గొప్ప ఇతిహాసాన్ని వరల్డ్ వైడ్ ఆడియన్స్ ముందుకు గ్రాండ్‌గా తీసుకురాబోతున్నారు. కాగా, ఈ క్రేజీ మూవీ పార్ట్-1 ను ఈ ఏడాది దీపావళి కానుకగా థియేటర్లలో రిలీజ్ చేయడానికి ప్లాన్ చేస్తున్నారు.


# రామ్‌తో ప్రేమ వార్తలకు భాగ్యశ్రీ బోర్సే

## -వైరల్ అవుతున్న కామెంట్స్!

మిస్టర్ బచ్చన్' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన బాలీవుడ్ బ్యూటీ భాగ్యశ్రీ బోర్సే ప్రస్తుతం టాలీవుడ్‌లో వరుస అవకాశాలతో దూసుకుపోతోంది. తొలి సినిమా ఆశించిన విజయాన్ని అందుకోకపోయినా, తన అందం, నటనతో దర్శక నిర్మాతల దృష్టిని ఆకర్షించిన ఈ భామ తాజాగా 'లెనిన్' సినిమాతో కెరీర్‌లో తొలి విజయాన్ని అందుకున్నట్లు ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. అయితే ఇప్పుడు ఆమె సినిమా కంటే ఎక్కువగా వ్యక్తిగత జీవితానికి సంబంధించిన వ్యాఖ్యలతో సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. కొంతకాలంగా హీరో రామ్ పోతినేనితో భాగ్యశ్రీ ప్రేమలో ఉన్నారనే ప్రచారం సినీ వర్గాల్లో వినిపిస్తోంది. ఇద్దరూ కలిసి నటిస్తున్న 'ఆంధ్రా కింగ్ తాలూకా' సినిమా ప్రారంభమైనప్పటి నుంచే ఈ రూమర్స్ ఊపందుకున్నాయి.అయితే ఈ వార్తలపై రామ్ గతంలో స్పందించి ఖండించినప్పటికీ, భాగ్యశ్రీ మాత్రం ఎప్పుడూ నేరుగా స్పందించలేదు. దీంతో ఈ ప్రచారానికి మరింత బలం చేకూరింది. ఇటీవల 'లెనిన్' సినిమా ప్రమోషన్లలో భాగంగా భాగ్యశ్రీ చేసిన కొన్ని వ్యాఖ్యలు కూడా చర్చనీయాంశమయ్యాయి. "హైదరాబాద్ నా రెండో ఇల్లు" అని ఆమె చెప్పడంతో, సోషల్ మీడియాలో మళ్లీ రామ్‌తో రిలేషన్‌పై ఊహాగానాలు మొదలయ్యాయి. అభిమానులు కూడా వీరిద్దరూ నిజంగానే డేటింగ్‌లో ఉన్నారేమో అంటూ కామెంట్లు చేశారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న భాగ్యశ్రీకి ఆసక్తికరమైన ప్రశ్న ఎదురైంది. మీరు కలిసి పనిచేసిన హీరోల్లో ఎవరితో ఫ్రెండ్‌షిప్, ఎవరితో డేటింగ్, ఎవరిని పెళ్లి చేసుకుంటారు? అని అడగగా, అఖిల్ అక్కినేని తనకు మంచి స్నేహితుడని చెప్పిన ఆమె, డేటింగ్ మరియు పెళ్లి విషయానికి వచ్చేసరికి ఒకే హీరో పేరును సూచిస్తూ నవ్వింది. నేను కలిసి నటించిన హీరోల్లో పెళ్లి కాని వ్యక్తి ఒక్కరే ఉన్నారు అని చెప్పడంతో, ఆమె ఉద్దేశం రామ్ పోతినేనినేనని నెటిజన్లు భావిస్తున్నారు. ఈ వ్యాఖ్యలకి సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. అభిమానులు సరదాగా భాగ్యశ్రీ పోతినేని అంటూ పోస్టులు చేస్తుండగా, మరికొందరు ఇది కేవలం ఫన్ సెగ్మెంట్ మాత్రమేనని అంటున్నారు. అయితే ఈ కామెంట్స్‌ని తమ ప్రేమ వ్యవహారానికి సంబంధించి అఫీషియల్ భావించే పరిస్థితి లేదు. రామ్ లేదా భాగ్యశ్రీ నుంచి ఈ అంశంపై ఎలాంటి స్పష్టమైన ప్రకటన రాలేదు.ప్రస్తుతం భాగ్యశ్రీ కెరీర్ పరంగా కూడా బిజీగా ఉంది. వరుస సినిమాలతో అవకాశాలు అందుకుంటూ ముందుకు సాగుతున్న ఈ నటి, 'లెనిన్' విజయంతో మరిన్ని ప్రాజెక్టులు దక్కించుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి.




# ప్రమోషనల్ పోస్ట్‌కు పదిలక్షలు?



సినిమాల పరంగా విజయాలు తక్కువే అయినా అచ్చ తెలుగందం శ్రీలీల క్రేజ్ ఏమాత్రం తగ్గడం లేదు. అందుకు యూత్‌లో ఈ భామకున్న ఫాలోయింగ్‌ను కారణంగా చెప్పొచ్చు. చూడముచ్చటైన రూపలావణ్యం, చలాకీ నటనతో ఈ భామ కుర్రకారులో మంచి ఫాలోయింగ్‌ను సంపాదించుకుంది. ఈ నేపథ్యంలో ఈ సొగసరి సినిమాల కంటే సోషల్‌మీడియా ద్వారానే భారీగా డబ్బులు సంపాదిస్తున్నట్లు తెలిసింది. శ్రీలీల ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో 17 మిలియన్ల ఫాలోవర్స్ ఉన్నారు. ఈ వేదికలో ఒక్క ప్రమోషనల్ పోస్ట్‌కు ఆమె 5 నుంచి 10 లక్షల వరకు ఛార్జ్ చేస్తున్నట్లు తెలిసింది. మొత్తంగా నెలరోజుల్లో దాదాపు 50 లక్షల వరకు ఈ భామ ఆర్జిస్తున్నదని ఇండస్ట్రీ ట్రేడ్ వర్గాల్లో వినిపిస్తున్నది. సోషల్‌మీడియాలో బ్రాండ్ కొలాబరేషన్స్ ద్వారా పెద్ద మొత్తంలో ఆర్జిస్తున్న కథానాయికల్లో శ్రీలీల ఒకరని చెబుతున్నారు. మరి ఈ వార్తల్లో నిజమెంతో తెలియదు కానీ.. ట్రేడ్ వర్గాల్లో మాత్రం బాగా ప్రచారమవుతున్నది.

# బాక్సాఫీస్ షేక్ చేసిన 'లెనిన్'..

## -మొదటి రోజే రూ.16.7 కోట్లతో అఖిల్ సరికొత్త రికార్డ్!




అక్కినేని అఖిల్ హీరోగా వచ్చిన లేటెస్ట్ రూరల్ యాక్షన్ డ్రామా 'లెనిన్' బాక్సాఫీస్ వద్ద అదిరిపోయే ఓపెనింగ్స్‌తో దూసుకుపోతోంది. మొదటి రోజే ఈ సినిమాకు ప్రేక్షకుల నుంచి పాజిటివ్ రెస్పాన్స్ రావడంతో, అఖిల్ కెరీర్‌లోనే బెస్ట్ ఫస్ట్ డే వసూళ్లను సొంతం చేసుకుంది.చిత్ర యూనిట్ అధికారికంగా ప్రకటించిన వివరాల ప్రకారం ఈ చిత్రం మొదటి రోజు ప్రపంచవ్యాప్తంగా రూ.16.7 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లను సాధించి బాక్సాఫీస్ వద్ద ఘనమైన విజయాన్ని నమోదు చేసింది. ట్రేడ్ వర్గాల అంచనాల ప్రకారం ఈ సినిమాకు ఇండియా నెట్ కలెక్షన్స్ దాదాపు రూ.5.90 కోట్లు, ఇండియా గ్రాస్ కలెక్షన్స్ దాదాపు రూ.6.73 కోట్లు, అలాగే ఓవర్సీస్ గ్రాస్ కలెక్షన్స్ దాదాపు రూ.3.00 కోట్లుగా వచ్చాయి. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ఈ సినిమాకు అత్యధిక వసూళ్లు వచ్చాయని, రెండు తెలుగు రాష్ట్రాల గ్రాస్ కలెక్షన్లే దాదాపు రూ.6 కోట్ల వరకు ఉన్నాయని సమాచారం. అఖిల్ కెరీర్‌లో గత చిత్రాలతో పోలిస్తే 'లెనిన్' అత్యధిక ఓపెనింగ్స్ సాధించిన చిత్రంగా నిలిచింది. కిషోర్ అబ్బూరు దర్శకత్వంలో, థమన్ సంగీతంలో వచ్చిన ఈ మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌లో భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా నటించగా, సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ మరియు అన్నపూర్ణ స్టూడియోస్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మించాయి. మొత్తానికి అయ్యగారు ఈ చిత్రంతో గట్టి కంబ్యాక్ ఇచ్చారని అభిమానులు పండగ చేసుకుంటున్నారు. వీకెండ్ కావడంతో శని, ఆదివారాల్లో ఈ కలెక్షన్లు మరికొంత భారీగా పెరిగే అవకాశం ఉందని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు

Edited,Printed,Published & Owned by Mr.Nakka Raju, RNI No : TGTEL/26/A0738, Printed at NEWS 24HRS MEDIA SERVICES,Suryapet,- 508213 Telangana.
Published at 1-113 Prabhat Nagar,Chaitanyapuri,Rangareddy,Telangana - 500060.Telangana State. EDITOR : Mr.NAKKA RAJU, Cell 9160600610 | netibharath.daily@gmail.com